
అర్చావతార ప్రభా



ఓమ్

శ్రియైనమః

అర్చావతార ప్రభా

(పద్య కావ్యము)

రచయిత

"ఆగమాచార్య, భిషగ్రత్న, కవీశ్వర, పౌరా

శ్రీమాన్ నల్లూరి రంగాచ

బాపట్ల

ప్రకాశకులు

గౌతమసోదరులు


నల్లూరి వేంకటరంగాచార్యులు – వేంకట సీతా

బాపట్ల

ప్రమాది **1973**

సర్వస్వామ్యములు ప్రకాశకులవి
ప్రతులు - వెయ్యి

వెల : రు ౩-౦౦



గజరాజ రక్షకులైన శ్రీ భావనారాయణస్వామివారు

క్షీరవృక్షము (పాలచెట్టు) నుండి


శ్రీ క్రిమికంఠచోళభూపాలునకు దర్శనమిచ్చుట.

శా॥ శ॥ 515 ఆలయ ప్రతిష్ఠోత్సవము క్రీ॥ శ॥ 594

ప్రమాదీచ నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ


ఆ ది వా ర ము

కృతిపతి.



శ్రీమద్దయామృతనిధే శ్రితపారిజాత
క్షీరాబ్ధివాస విబుధద్విజశేషిభూత
క్షీరద్రుపాత ఘటప్రైనతదివ్యమూర్తే
శ్రీభావదేవచరణౌ శరణం ప్రపద్యే॥

జగజ్జనని



వైకుంఠనాధ దయితాం కలశాబ్ధికన్యాం
వాణ్యాది దేవవనితార్చితపాద పీఠాం
వైకుంఠవాసరసికాం వరదాన శీలాం
లక్ష్మీమశేష జగతాం జననీం ప్రపద్యే॥

గ్రంథకర్త - వారి సతీమణి

(ప్రకాశకుల పితామహులు)





శ్రీమాన్ నల్లూరి రంగాచార్యులుగారు శ్రీమతి రత్తమ్మగారు


1852 - 1928

బాపట్ల

పరమ పూజనీయ భావదేవామల
చరణ కమలసేవ సలపి వాణి
కరుణగాంచిమించి కావ్యామృతము ప్రజా
వళికి బంచె నీ భిషగ్వరుండు.

గ్రంథకర్తగారి కుమారుడు - కోడలు

(ప్రకాశకుల పితరులు)

శ్రీమాన్ నల్లూరి వేంకటరామాచార్యులుగారు — శ్రీమతి రాఘవమ్మగారు

1882 - 1956

బాపట్ల

——

ప్రథితకృషియొనర్చి వైఖానసాన్వయ
ధర్మ మర్మములను తరచి యిష్ట
దైవమైన భావదేవుని సేవించి
మాన్యుడైన యట్టి ధన్యజీవి.

మా మా ట

శ్రీ వైఖానసాగమానుసారముగ భగవదర్చన కొనసాగింపబడెడి దివ్యదేవాలయములలో (బాపట్ల) శ్రీ భావదేవ క్షేత్రము గణనీయమైనదైయున్నది. ఈ స్వామివారిని గురించియు - భావపురిని గురించియు - భావపురిలోగల వివిధములైన యాధ్యాత్మిక సంస్థల గురించియు బాపట్ల శ్రీ భావనారాయణస్వామి క్షేత్రమాహాత్మ్యమనెడి పేర నొక గ్రంథమును, శ్రీ భావదేవసుప్రభాతమును లోగడ మేమే ప్రచురించియున్నాము.

ప్రస్తుతము మా పితామహులచే మధురశైలిలో రచించి ప్రచురింపబడిన శ్రీ మదర్చావతార ప్రభావకావ్యమును పునర్ముద్రణ మొనర్ప సంకల్పించితిమి. కాలమాన పరిస్థితులనుబట్టి ముద్రణ విషయమొక గడ్డుసమస్యయైనది. మార్గాన్వేషణ మొనర్చుచుండ శ్రీ భావదేవుడే యొకత్రోవ జూపించెను

21-2-1973 వ తేదీకి సరియగు స్వస్తి శ్రీ పరీధావి సంవత్సర మాఘ బహుళ చతుర్థి బుధవారము చిత్తా నక్షత్ర యుక్త మేషలగ్నమున బ్రాహ్మణసిరిపూడిలో శ్రీ సీతారామస్వామివారి ఆలయములో జరుప నిర్ణయింపబడిన ధ్వజప్రతిష్ఠ- శ్రీ ఆంజనేయస్వామివారి పునఃప్రతిష్ఠలకు మా సోదరుల నిరువురను కార్యకర్తలాహ్వానించినారు. ఆ యాహ్వానమే గ్రంథముద్రణకు బాటయగుటొక మహాశ్చర్యకర విషయము.

బ్రాహ్మణసిరిపూడి గ్రామములో శ్రీ సీతారామస్వామి దేవాలయమును లోహిత సగోత్రోద్భవులైన శ్రీ మద్దాలి శాస్త్రులు - లక్ష్మీనరసమ్మ దంపతులు 1916 సం॥లో నిర్మించి


యున్నారు. భారద్వాజ సగోత్రోద్భవులైన శ్రీ కొమరవోలు వెంకటాద్రియయ్య - మంగమ్మ దంపతులు 1950 సం॥లో జీర్ణోద్ధారణచేయగా రెండు పురుషాన్తరములపిమ్మట శ్రీమద్దాలి శాస్త్రిలుగారి దౌహిత్రులు - దత్తపుత్రులునగు శ్రీకృష్ణమూర్తిగారు, వారిధర్మపత్ని - సత్యప్రసూనాంబగారలు అచ్చట నూత్నధ్వజప్రతిష్ఠకును - శ్రీఆంజనేయస్వామివారి పునః ప్రతిష్ఠకును శ్రద్ధాభక్తులతో పూనుకొని దీక్షాకంకణమును ధరించిరి. వారి సంకల్పబలమున శ్రీ వైఖానసాగమోక్తముగా శతప్రతిష్ఠాచార్యులైన పండిత శ్రీమాన్ దీవి రామాచార్యుల వారి ఆధ్వర్యములో నాప్రతిష్ఠాకలాపమంతయు జయప్రదముగ నిర్వహింపబడినది.

ఆమహోత్సాహ సమయమున వేదపండిత సన్మానముల గావించుచున్న శ్రీకృష్ణమూర్తిగారిదృష్టికి ఈ గ్రంథముద్రణ విషయమును మేముగొని తెచ్చితిమి. విషయమునంతయు విని వారు మరుమాటాడక ప్రతిష్ఠజరిగిన శుభసమయమునకు గుర్తుగ గ్రంథముద్రణ మొనర్ప సమ్మతించినారు. శ్రీ భావదేవుని కృపవలనను, శ్రీ కృష్ణమూర్తిగారి సహాకారమువలనను శ్రీ మదర్చావతార ప్రభావకావ్యము ముద్రింపబడినది.

సహృదయులు సరసులునగు పలువురు పెద్దలు మా ప్రయత్నము నాశీర్వదించుచు, నభినందించుచు వారివారి యమూల్యాభిప్రాయముల నొసగిరి. అందరకు మా అభినందనము లందించుచు శ్రీ భావనారాయణస్వామివారికీకృతిని సమర్పించుచున్నాము.

ఇట్లు
ప్రకాశకులు.

శ్రీ సీతారామస్వామివారి దేవాలయ ధ్వజప్రతిష్ఠాదుల
సందర్భమున ఋత్విక్కులతో
శ్రీ మద్దాలి కృష్ణమూర్తి దంపతులు. 21–2–73



కూర్చున్నవారు కుడినుండి ఎడమకు :


1. శ్రీ నల్లూరి వేంకటరంగాచార్యులు–బాపట్ల 2. శ్రీ మేడూరి రామచంద్రాచార్యులు–వేమూరు 3. శ్రీ పరాశరం గోపీనాథాచార్యులు–చేబ్రోలు 4. నల్లూరి వెంకట్రాయదీక్షితులు–బాపట్ల 5. శ్రీ నారాయణం రఘునాధచక్రవర్తిభట్టాచార్యులు–ఖాజీపాలెం.

నిల్చున్నవారు మొదటివరుస : 1. శ్రీ దీవి సీతారామాచార్యులు–గొడవర్రు 2. శ్రీ పెద్దింటి వరదాచార్యులు (అర్చకులు) – ఆరుంబాక 3. శ్రీ నల్లూరి వెంకటసీతారామాచార్యులు–బాపట్ల 4. నల్లూరి పాంచజన్యం–బాపట్ల 5. శ్రీ దీవి రామాచార్యులుగారు(అధ్వర్యులు)ముట్లూరు 6.నల్లూరి మోహనరంగాచార్యులు–బాపట్ల 7. శ్రీ పరాశరం వెంకట్రామాచార్యులు–చేబ్రోలు 8. దీవి శ్రీమన్నారాయణాచార్యులు–వట్టిచెఱుకూరు 9. శ్రీ నల్లూరి వెంకటసుదర్శనజ్వాలానరసింహాచార్యులు–బాపట్ల 10. శ్రీ రొంపిచర్ల శ్రీనివాసాచార్యులుగారు–పాతరెడ్డిపాలెం.

రెండవ వరుస: శ్రీ మద్దాలి కృష్ణమూర్తిగారు, శ్రీమతి సత్యప్రసూనాంబ–
దంపతులు–బాపట్ల (యజమానులు)



శ్రీ మద్దాలి శాస్త్రులు-లక్ష్మీనరసమ్మ దంపతులచే
1916 సం॥లో ప్రతిష్ఠింపబడిన
శ్రీ సీతారామస్వామివారు-బ్రాహ్మణసిరిపూడి.



శ్రీ కొమరవోలు వెంకట్రామయ్య-మంగమ్మ దంపతులచే
1950 సం॥ పునరుద్ధరణగావింపబడిన ఆలయము.
21-2-73 న ప్రతిష్ఠించబడిన నూతన ధ్వజము.


భక్తజనకల్పకము

వేదాగమోద్ధారక
శ్రీ కొండపల్లి వాసుదేవరావు
బి.ఎ.ఎల్.ఎల్.బి, ఐ.ఎ.ఎస్.
కమీషనర్ - ఎండోమెంట్సు (ఆం.ప్ర.)
హైదరాబాదు - 1

శ్రీమాన్ నల్లూరి రంగాచార్యులవారిచే రచింపబడిన "శ్రీమదర్చావతార ప్రభావము" అను గ్రంథమును ఆమూలాగ్రముగ చదివితిని. ఇది సులభశైలిలో ప్రబంధముగా విరచింపబడినది. ప్రబంధ లక్షణములన్నియు ఉత్తమరీతిలో శోభించుచున్నవి. శ్రీవిఖనసమహర్షిచే ప్రపంచమున కంద జేయబడిన అర్చావిధానములు సుగమముగా విస్తరింపబడినవి.

ఈ ప్రబంధము అర్చావతార విశేషమును వస్తువుగా జేసి విపులముగా వ్రాయబడినది. పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ, అను పంచ విధముల మోక్షప్రాప్తి సామాగ్రిలో తురీయము "అర్చ". కలికాలమందు సులభముగా ప్రాప్తించు అర్చావతార ప్రభావము భక్తజన బృందమునకు కల్పకమువంటిది. ఈ పుస్తకము భావసౌరభముచే గుబాళించుచు సర్వజనసామాన్యమై అందరికిని అందుబాటులోనుండి, పురాణగాథలతో నిండి అత్యంతరమణీయముగ నున్నది. ఈ పుస్తకమును భక్తులెల్లరు చదివి ఆనందించెదరని ఆశిస్తున్నాను.

శ్రీ భగవానుడు ప్రకాశకులకు, ఆయురారోగ్యములొసంగి ఇంకయూ కొన్ని రచనలను ప్రపంచమున కందజేయగలడని ప్రార్థిస్తున్నాను.



అత్రిః భృగుః శ్రీ విఖనాః మరీచిః కశ్యపః

(శ్రీ భావనారాయణస్వామివారి దేవస్థానము - బాపట్ల)

భృగ్వత్రికశ్యప మరీచిమహర్షిమధ్యే
స్థిత్వాసనేకుశమయే సముదీరయన్తమ్
శాస్త్రసారమఖిలం విఖనోమునీన్ద్రమ్
భూయోనమామి భువనైక గురుం ప్రసన్నమ్॥

శ్రవణే శ్రావణే శుక్లపూర్ణిమా సోమవాసరే
సింహలగ్నేచ సంయుక్తే భజేనైమిశమాగతమ్॥

నిరుపమగుణ పూరమ్ నిత్యసత్యప్రచారమ్
నతజనమునివారమ్ నౌమితత్త్వార్థసారమ్
కలుషనగమహేన్ద్రమ్ కామితార్థైక కేన్ద్రమ్
విఖనసముని చన్ద్రమ్ దివ్యభవ్యాబ్ధిసాన్ద్రమ్॥

లక్ష్మీవల్లభ సంకల్ప వల్లభాయమహాత్మనే
శ్రీమద్విఖనసేతుభ్యమ్ మునివర్యాయ మఙ్గళమ్॥

సత్కార్యము


శ్రీ కె. వి. నరసింహమూర్తి
బి.ఎ.ఎల్.ఎల్.బి.
డిప్యూటీ కమీషనరు – ఎండోమెంట్సు
విజయవాడ – 2

శ్రీ బాపట్ల భావనారాయణస్వామివారి వంశపారం పర్యార్చకులలో నొకరగు శ్రీమాన్ నల్లూరి రంగాచార్యుల వారు రచించిన 'అర్చావతార పరిభావమును' చదివి యానం దించితిని.

ఇది శ్రీ వైఖానసాగమ విశేషములను – శ్రీ విఖనస మహర్షి మహోదయమును వర్ణించుచున్న కావ్యము. సరస శైలిలో గల ఈ గ్రంథము డెబ్బదియేండ్ల క్రిందట ముద్రింప బడినది.

దీని అవసరమును గుర్తించి గ్రంథకర్తగారి పౌత్రులగు గౌతమసోదరులు పునర్ముద్రణ చేయబూనుకొనుట ముదావహ మైన విషయము. ఇట్టి కావ్యములు ప్రచురింప బడుటవలన యెన్నియో క్రొత్త విషయములు వెలువడును. గౌతమ సోదరులొనర్చిన యీ సత్కార్యము నిజముగ అభినంద నీయము.

శ్రీ భావదేవుడు ఇట్టి గ్రంథములనేకము వెలుగునకు తెచ్చి భక్తజనమనోరథముల ఫలింపజేయుగాక యని మనసార కాంక్షించుచున్నాడను.





శ్రీ రాజ్యలక్ష్మీ తాయారు - శ్రీ భావనారాయణస్వామి





శ్రీస్వామివారి పాదపద్మారాధకులు - ప్రకాశకులు - గౌతమసోదరులు

(గ్రంథకర్తగారి పౌత్రులు)

నల్లూరి వేంకటరంగాచార్యులు - వేంకటసీతారామాచార్యులు

బాపట్ల

ఓమ్ శ్రియైనమః

పరిచయము

చతుశ్శాస్త్ర మహావిద్వాన్, కులపతి, న్యాయరత్నాకర

శ్రీమాన్ పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యః

ఆస్థాన విద్వాన్ తిరుమల తిరుపతి దేవస్థానములు

(అప్పికట్ల) తిరుమల

13-8-1973 ప్రమాది శ్రావణి.

శ్రీ వైఖానసకుల తిలకుడగు నీ గ్రంథకర్త పణ్డిత రంగాచార్యులవారు దేవయజనదక్షులు; పౌరాణిక శేఖరులు వైద్య విధాన నిష్ణాతలు, కర్మనిష్ఠాగరిష్ఠులు, అయియున్నారు.

క్షీరార్ణవమున నాగపర్యంకమును వీడి భావపురమున క్షీరతరుమూలము నందర్చావతారమున, యావిర్భవించిన శ్రీ మన్నారాయణుని పరమవైదిక విధానముచే నారాధించిన వీరు కవితా ధురంధరులై కృతజ్ఞతా ప్రకాశనమోయన నీ యర్చావతార ప్రభావమును శ్రీ రంగాచార్యులవారు సర్వమానవ సౌలభ్యముగ నాంధ్ర భాషలో రచించి ధన్యతను సంపాదించుకొని యున్నారు.

అఖిల జగదుద్భవస్థితిలయ లీలావినోదియగు శ్రీమన్నారాయణుడు దయాసముద్రుడగుటచే పరత్వమును వీడకనే సర్వచేతన రక్షణార్థమై సౌలభ్యముగ నర్చావతారమున, వేంచేసి యున్నారని వేదశాస్త్రములు, విజయధ్యానములు చేయుచున్నవి.

ఉపనిషత్తులు "మాతాపితాభ్రాతానివాసశ్శరణం సుహృద్గతిర్నారాయణః" అని శ్రీమన్నారాయణునియందు

పరిబోధించు మాతృత్వ పితృత్వాది సర్వవిధ బంధుత్వములు సర్వవిధ చేతనులకుకూడా అర్చావతారమునందనుభవించతగి యున్నవియని స్పష్టీకరించు చున్నవి.

"స్వత్వ మాత్మని సంజాతం స్వామిత్వం బ్రహ్మణి స్థితం" ఇతి. చేతనునియందు స్వత్వము, పరబ్రహ్మయగు శ్రీమన్నారాయణునియందు స్వామిత్వము, సహజ ధర్మములు అని ప్రమాణములు పరిబోధించుచుండ మద్రాసివాసీ భగవాన్ 'మమాయం రామః" "మమాయం కృష్ణః" అని దేవునియందు స్వత్వమును, తనయందు స్వామిత్వమును–అటులనే రామకృష్ణాదులయందు స్వత్వమును తమయందు స్వామిత్వమును తెలియజేయునట్టి అజ్ఞానులయొక్కయు, విజ్ఞానులయొక్కయు స్వత్వ స్వామిత్వ వ్యత్యయ సంలాపములను, ఇయత్తావిధురమగు ప్రేమవాత్సల్యాతిరేకములచే పితృపుత్ర న్యాయముగా నానందించు, అవతారము అర్చావతారము. (సప్తాచలమున చూడుము).

భగవద్గుణానుభోక్తలగు మహర్షులు మందాధికారుల యొక్క సౌలభ్య సౌశీల్యాద్యనుభవ సంజనితానంద పరంపరల సాక్షాత్కరించుకొని భగవదవతారములలో నీయవతారము పరమశ్రేష్ఠమని వాకొనుచున్నారు.

దేశనియమము, కాలనియమము, అధికారనియమము లేక ఆహార విహారాది వ్యాపారములకుకూడా ఆరాధక పరాధీనుడై అపరాధములను పాటించక సర్వసహిష్ణువై బింబ సాన్నిధ్యమునుపొంది సర్వాభీష్ట పరిదాతయై చేతనులకు

రక్షించు నవతారమగు నీయర్చావతారము పరమశ్రేష్ఠము అని చెప్పుటలో వేదములకు, శాస్త్రములకు, మహర్షులకు పక్షపాతమించుకంతయు లేదని దృఢముగా చెప్పుతగియున్నది. (సప్తాచలమున చూడుము).

సర్వవిధముల పరత్వమునుననుభవించు నీ యర్చావతారమునుగూర్చి నతిసులభశైలిలో నీయాచార్యులవారిచే రచింపబడిన ఈ యర్చావతార ప్రభావము పాఠక చేతన లోకమునకు పరత్వ సౌలభ్యములచే ప్రకాశించు పరమేశ్వరునివలె ఉత్తరోత్తరము ఆనంద పరంపరల నందించుచు ("అర్చావతారస్సర్వేషాం బాంధవో భక్తవత్సలః" ఇత్యాదిగా శాస్త్రములు విశదీకరించు చున్నవి.) ఇక్షురసన్యాయముగా మధురాతి మధురమై వర్ధిల్లుగాక.

—o—

క్షీరార్ణవే ఫణిపతౌ శయితస్త్వమత్ర
క్షీరద్రుమేచవసతింబహుమన్యమానః
క్షీరోదజాసహచరస్సకలాన్ త్వదీయాన్
సంరక్షితుం వససి కేశవ భావదేవ.

శ్రీ భావదేవాయనమః శ్రీమతే వైఖనసేనమః

అ ను మో ద ము

రాష్ట్రపతి బహుమతి గ్రహీతలు
వైయాకరణ పంచానన ఆగమాచార్య - విద్వత్కవిసార్వభౌమ

శ్రీమాన్ పణ్డిత రొంపిచర్ల పార్థసారధి భట్టాచార్యులు

తి రు మ ల

మూడు ఆశ్వాసములుకల "అర్చావతార ప్రభావము" అను చిన్న పుస్తకము చదివి చూచినాను. బాపట్ల భావదేవునిసన్నిధి పురాణస్థలముగా తెలియుచున్నది. శ్రీవారి అర్చకులు అప్పటినుంచి శ్రీ వైఖానస సూత్రము వారనిన్ని అర్చకకుటుంబమువారు పారంపర్యముగ నేటికిని విద్వాంసులు, కవులు అనియు ప్రశంసింపబడుచున్నారు. గ్రంథకర్త యొక్క రచనాశైలి మనోహరముగా నున్నది. ఈ ప్రచురణము ద్వితీయ ముద్రణము అగుటచే దీనియందుగల అభిరుచి నిర్ణయింపబడగలదు. గ్రంథకర్త తనరచన స్వతంత్ర కల్పనముకాక పురాణోద్ధృత చరిత్ర మూలకమని చెప్పుటచే వారి ప్రామాణికత్వము తెలియుచున్నది. బాపట్లలో వేంచేసియున్న శ్రీ గరుత్మంతునకు సంప్రదాయముగ జరుపబడుచు వచ్చుచున్న గరుడాష్టోత్తర శతనామస్తోత్ర మిందు చేర్చబడినది. ఇది ప్రాతముద్రణము కంటె ఆదరణీయ విషయము. భక్తులందరు దైనందిన పారాయణ పుస్తకముగ కూడ దీనిని వినియోగించుకొనుటకు అనుకూలముగ నున్నది. శ్రీ భావదేవుని కృపచే ఈ పుస్తకము భక్తజనమునకామోదము నీయగలదని ఆశించుచున్నాను. గ్రంథ ప్రకాశకులు నాకీ నాల్గు మాటలు వ్రాయుట కవకాశము మిచ్చినందులకు వారికి నా కృతజ్ఞతను నివేదించుచున్నాను.

—0—

ఆనందము

శ్రీ దేవిరెడ్డి నందగోపాలరెడ్డి
అసిస్టెంటు కమీషనరు
హిందూదేవాదాయ ధర్మాదాయ శాఖ
బాపట్ల

శ్రీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ భావనారాయణస్వామి వారు బాపట్ల పట్టణవాసులకే కాక యావదాంధ్రులకు – ఇష్ట దైవము. ఈ స్వామివారికి జరిగెడి బ్రహ్మోత్సవము – కన్నుల పండుగజేసి యీ క్షేత్రప్రశస్తిని వేయినోళ్ళచాటుచుండును.

శ్రీ స్వామివారి – అర్చక బృందమున నొకరగు శ్రీమాన్ నల్లూరి రంగాచార్యులగారిచే సుమారొక 70 సంవత్సరముల క్రిందట రచింపబడిన ఆంధ్ర పద్యకావ్యమే శ్రీ మదర్చావతార ప్రభావము.

శ్రీ రంగాచార్యులగారు నైష్ఠికధర్మముల నాచరణలో బెట్టుచు భగవదర్చన గావించి తరించిన – ఉత్తమపండితులని వారి వంశక్రమ పరంపరనుబట్టి తెలియుచున్నది. దైవానుగ్రహబలమున వారికి ఆగమ శాస్త్ర విజ్ఞానముతోబాటు కవితా ప్రజ్ఞయు లభ్యపడుట మఱొక విశేషము.

కవితాశక్తిచే – భగవంతుని మహిమలను అర్చావతార విశిష్టతను అర్చనారీతిని బ్రహ్మోత్స విశేషములను వివరించుట కొరకే యీ మహనీయుడు వినియోగపరచుకొని ధన్యుడగుట మరియొక మహావిశేషము. ఆ పూజ్యుని పవిత్రదృష్టి ప్రశంసనీయమైనట్టిది.

ఈ కావ్యమున శ్రీ వైఖానస సూత్రకర్తయగు విఖనసాచార్యులవారి ప్రాదుర్భావము వైఖానసాగమ విశిష్టతయును విశదీకరింపబడియున్నవి.

అనాదిగా వైఖానసాగమ సూత్రానుసారముగ - అర్చనలందుకొనుచున్న భావదేవుని అర్చక పరంపరలోని వారును గ్రంథకర్తయొక్క పౌత్రులును గౌతమసోదరులునగు శ్రీమాన్ నల్లూరి వేంకట రంగాచార్య - వేంకట సీతారామాచార్యులు - గారలు ఈ కావ్యపునర్ముద్రణమునకు బూనుకొనుట ముదావహ విషయము.

ఇట్టి పవిత్రకావ్యము పునర్ముద్రణ భాగ్యమునందుచున్న తరుణమున - ప్రాంతీయ దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారిగా నేనుండుట నా సుకృత విశేషమని యెంచుచున్నాను.

ఈ సందర్భమున నాకుగల్గిన యానందము నిట్లు వెలువరించుకొనుటకు సదవకాశమును గలుగజేసిన ప్రకాశకులకు నా ధన్యవాదములు.

శ్రీ భావదేవుని కృపవలన యిట్టి ప్రాచీన గ్రంథములెన్నియో వెలుగునకు రావలయునని నేను నిండుమనస్సుతో కాంక్షించుచున్నాను.

—o—

క్షీరవృక్షేన తీర్ణాయ క్షీరసాగరశాయినే
రాజ్యలక్ష్మీ సమేతాయ భావదేవాయమఙ్గళమ్॥

ఆ మో ద ము

అభినవపోతన "భగవత్కవిశేఖర"

శ్రీమాన్ నరహరిగోపాలాచార్యులు, తమ్మర.

"శ్రీ మదర్చావతార ప్రభావము" అనెడి మూడాశ్వాసముల గ్రంథము నాపాదచూడము సేవించితిని.

భూషణములు చెవులకు బుధ
తోషణములనేక జన్మదురితౌఘవిని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమనుగుణభాషణముల్॥

అని బమ్మెరపోతరాజుగారు నుడివినట్లు భగవద్గుణ విశేషణ నిరూపణ రచనాంచితమగు నీగ్రంథము పరమపవిత్రమైనది. దీనియందు శ్రీహరి యర్చావతార విధానాగమ శాస్త్ర నిర్మాతయగు శ్రీ విఖనోమహర్షి యవతార వృత్తాంతంబును, అర్చావిధానంబును తద్భక్తియు నుత్సవవిశేషంబులును, తత్ఫలంబును బహ్మాండాంతర్గతంబులగు కథావిధానంబులును పొందుపఱచబడియున్నవి. విశేషములు విశేషజ్ఞులెరింగి సంతసింతురని నమ్ముచున్నాను.

ఈ గ్రంథాంతమందు పైగ్రంథకరగారి పౌత్రులు శ్రీమాన్ నల్లూరి వేంకటరంగాచార్యులవారు సమకూర్చిన శ్రీ గరుడాష్టోత్తర శతనామస్తోత్రము, నామావళియు జేర్చుట మిగుల శ్లాఘ్యమై యున్నది. ఈ గ్రంథముల బ్రకాశింపజేసి భక్తపాఠకలోకమునకందించిన ధన్యులకు ధ న్య వా ద ము

లర్పించుచు కృతికర్తలు కీర్తిశేషులునగు శ్రీమాన్ నల్లూరి రంగాచార్యులవారిని పద్యచతుష్టయముతో బ్రశంసించి ముగించుచున్నాను.

శ్రీమద్విద్వత్కవి
ధామా! నల్లూరి రంగధామాఖ్యా! సుధీ
భూమానందా! త్వత్కృతి
లో మాధుర్యంబు విజ్ఞలోకము మెచ్చున్॥

పోతనశైలిలోనిమధువున్ మఱినన్నయముఖ్యసత్కవి
వ్రాతములోని దార్ఢ్యతయు బద్యములందున నచ్చటచ్చటన్
స్ఫీతముగాగనంబడెడి శ్రీతరుణీశకృపారసస్ఫుట
శ్రీతనువొందినట్టికృతి శిష్టులు మెచ్చి నుతించునట్లుగన్॥

రంగచ్ఛ్రీసువికుంఠలోకమున శ్రీరంగేశునాస్థానమం
దంగీకారమునొంది కావ్యరచనాహ్లాదంబు గావింప
శ్రీరంగాచార్యసుధీమణీ యరిగినారా! శ్రీవికుంఠంబహో
రంగా మీకృతి మీస్వరూపమయి సంరక్షించెడిన్ భక్తులన్॥

శ్రీమద్భావపురీనివాసుడగు లక్ష్మీనాథునర్చించి త
ద్ధామంబందితరించినారు మును త్వత్పాదాంబుజచ్ఛాయలం
దేమమ్మున్ నడిపించ శ్రీవిభునకెంతే విన్నవింపన్వలెన్
దామీదీనులకోసమై యచట విద్వద్రాజచూడామణీ॥

Sri D. Vighanasacharyulu,

Asst. Engineer,
T. T. Devasthanams
TIRUPATI

I have the opportunity of reading the "Archavatara Prabhava" book in Telugu, written by late Sri Rangacharya of Bapatla. This explains in simple language about glory of Idol worship according to Vaikhanasa Agama.

The ambition of human soul is "Mukti" or liberation from the birth and death cycle. This emancipation of soul is explained in Vedanta Sastra. The Philosophy of Vedanta is enshrined in the Upanishads, the Gita and the Brahma Sutras, which are together called Prasthanatraya.

The Prasthanatraya says, the Brahman is spiritually realizable by moral and spiritual discipline. Moral discipline is explained in Karama yoga, and spiritual discipline in Jnana Yoga. These Karma and Jnana Yogas are means to Mukti only through Bhakti Yoga.

In Bhakti Yoga the worship of God is in four ways i.e. Japa, Homa, Archana and Dhyana. Out of the four the Archana is the best and easy in Kaliyuga. The present book Archavatara Prabhava, explains this.

May the Lord Venkateswara of Seven Hills shower His choicest blessings on the publishers of this book.

శుభాకాంక్ష

ఉపన్యాస మహోదధి

శ్రీమాన్ పణ్డిత నారాయణం రఘునాథ చక్రవర్తి భట్టాచార్యులు, ఖాజీపాలెం.

శ్రియఃపతియై శ్రీ వైకుంఠ నికేతనుడైన శ్రీమన్నారాయణుడు స్వాశ్రితజన సంరక్షణార్థము - అనేక దివ్యావతారముల ననుగ్రహించి సహృదయ శిష్టజనరక్షణంబును దుర్హృదయ దుష్టజన శిక్షణంబును గావించి లోకంబున తన దివ్యమహిమలజాటెను.

తదనన్తరము సౌలభ్యగుణ ప్రకాశనార్థమై దేవతిర్యఙ్మనుష్యాత్మకంబైన జీవసమూహమున సజాతీయత ప్రకటించుచు - వ్యూహవిభవావతారంబుల నవతరించి యెల్లరచే నారాధితుండగుచు శ్రీ స్వామి భక్తజనుల ననుగ్రహించుచున్నాడు. పిమ్మట శిలా, లోహ, మృద్దారుమయమైన అచేతన సజాతీయమగు అర్చారూపుడై స్వయంవ్యక్తుడై ఆరాధక లోకసమారాధనీయుడై బదరీక్షేత్రమున నారాయణ మూర్తిగ, వేంకటాద్రిని శ్రీనివాసమూర్తిగ పలుదివ్యదేశముల వరదరాజ రంగేశ్వరాది రూపములలో నవతరించి సర్వకాలముల సేవలంగొనుచు శ్రియఃపతి భక్తులను తరింపజేయుచుండెను.

కీర్తిశేషులయిన శ్రీమాన్ నల్లూరి రంగాచార్యులవారి రచన శ్రీమదర్చావతార ప్రభావము. వారు నల్లూరి వంశ

పయఃపారావార రాకాసుధాకరులు. శ్రీ భావనారాయణ కృపాసమాసాదిత సరసకవితాధురంధరులు.

భావపట్టమునస్వయంవ్యక్తులైన శ్రీ భావనారాయణ స్వామివారు భక్తకల్పద్రుమము. సద్యఃప్రవాహిత కృపాసింధువు. సర్వకామదాన మహితాభయకరకమలశోభితుడు. శ్రీరామ నారసింహా కేశవ రాజ్యలక్ష్మి విఖనసాచార్య, రంగనాయక గోదాదేవి పరివృతుడు. శ్రీవైనతేయ, హనుమద్యతిరాజ ప్రపన్నగణ పరిసేవితుడు.

శ్రీమాన్ నల్లూరి రంగాచార్యస్వామివారు రచించిన అర్చావతార ప్రభావము. మహాకావ్యలక్షణ లక్షితమై యున్నది. శ్రీ విఖనసాచార్య ప్రాదుర్భావముతో బాటుగా అర్చావతార వైభవమునుగూడ వ్యస్తముగా సమస్తముగా ప్రవచించుటలో వీరి రచన మిన్నందినది. సందర్భోచితవర్ణనా వైచిత్రితో కావ్యత్వముకమిచికొన్నది.

ఈ గ్రంథమును పునర్ముద్రణ మొనర్చి లోకమునకందించెడి మహాభాగ్యము శ్రీ ఆచార్యస్వామివారి పౌత్రులగు శ్రీమాన్ వెంకట రంగాచార్య, వెంకట సీతారామాచార్య సోదరులకే దక్కుటొక మహాభాగ్యము.

ఈ దివ్య ముద్రణ కార్యమును సభక్తికముగా నిర్వహించిన గౌతమ సోదరుల కృషి ప్రశంసనీయము. వీరికి శ్రీ భావదేవుడు ఆయురారోగ్యైశ్వర్య భోగభాగ్యములను ప్రసాదించవలెనని కాంక్షించుచున్నాను.

తథాస్తు

శ్రీ భావనారాయణస్వామినేనమః

అ భి న ం ద న

కవికథకరత్న, హరికథాసుధాకర, కథాగాన కళాప్రపూర్ణ

శ్రీమాన్ పణ్డిత పెద్దింటి సూర్యనారాయణదీక్షితదాసు

న ర్సా పు ర ము.

శ్రీ చిత్తాబ్జమిళిందమూర్తి, త్రిజగత్ క్షేమంకరుం, డాగమ
ప్రాచుర్యార్ష సుసంప్రదాయ విహితార్చావైభవస్ఫూర్తి లీ
లాచాతుర్యవినోదభాసుర సముల్లాసుండు నల్లూరి రం
గాచార్యోత్తమకావ్య, మక్షరయశంబందన్ గటాక్షించుతన్॥

*　　　*　　　*

కమనీయప్రవణప్రవృత్తి విలసత్కల్పంబనన్ దోచి భ
వ్యమనీషా సుషమాప్రదీప్తమగు శ్రీ అర్చావతారప్రభా
వమనోజ్ఞోత్తమ పారలౌకికకృతివ్యాసంగ మాముష్యల
బ్ధి, మనుష్యత్వములోనగొల్పుతనుతృప్తిన్ మాధవత్వప్రభన్॥

*　　　*　　　*

గరుడాష్టోత్తర శతనా
మకృతిన్ భవఘోరవ్యజనమరుదశనంబుల్
నిరయంబుజెంద మోక్షం
బరితిన్ లభియింపకున్నె ఆస్తికతతికిన్ ?



శ్రీనివాస పరబ్రహ్మణేనమః

మానసోల్లాస నివేదనము

"విద్వత్కవిశేఖర"

శ్రీమాన్ పణ్డిత నారాయణం రామానుజాచార్యులు

సాహితీసదనము - ఉల్లిపాలెం

రేపల్లె తాలూకా, గుంటూరుజిల్లా.

శ్రీమదుభయవేదాన్త ప్రవర్తకులును, శ్రీవైఖానస శ్రౌతస్మార్త భగవచ్ఛాస్త్రక్రియాప్రయోగ నిష్ణాతలును ఆయుర్వేదవిద్వద్వరేణ్యులును, మహాకవిజనమాననీయ ప్రతిభా సంపన్నులును, శ్రీ వైఖానసకులతిలకాయమానులును, యశఃకాయులునగు శ్రీమాన్ పణ్డిత నల్లూరి రంగాచార్యస్వామివారు రచించిన "శ్రీమదర్చావతారప్రభావము" అను నీగ్రంథ రాజమునామూలాగ్రముగా దిలకించి చక్షుష్మత్త్వమున కనుకూలమగు ఫలమును సంపాదించగల్గితిని.

ఆచార్యులవారిచే రచియింపబడిన సంస్కృతాంధ్ర గ్రంథ సుమమాలికయందిది మహామోదప్రచురణశీలముగల నొకానొక దివ్యకుసుమము. ఈ గ్రంథపఠనము నాకెంతయో సంతోషదాయకమైవిలసిల్లెను. ఇయ్యది ఆశ్వాసత్రయాత్మకమై యెసలారుచున్న మహోత్తమ ప్రబంధము.

ఇందు ప్రథమాశ్వాసమున సకలజగదాచార్యవర్యులగు శ్రీమద్విఖనోమునీంద్రుని యావిర్భావము, ద్వితీయాశ్వాసమున భక్తలక్షణము, ఊర్ధ్వపుండ్రలక్షణము, స్వయంవ్యక్త, దైవిక, సైద్ధ, మానుషస్థలభేద నిర్ణయము, భగవత్ప్రతిష్ఠార్చనోత్సవాది ఫలనిర్ణయము. తృతీయాశ్వాసమున, నిత్యకైంకర్య ఫలనిర్ణయము విశదీకరింపబడియుండెను.

మరియు గ్రంథాంతమందు ప్రదక్షిణనిర్ణయము బ్రహ్మోత్సవాహ్నిక సంజ్ఞనుబట్టి వాహనభేదనిర్ణయము భగవదర్చనాఫల నిర్ణయము శ్రీమద్గరుడాష్టోత్తరశతనామ స్తోత్రము నామావళియునుగలిగి బహువిధోపకారకమై యలరారుచుండెను.

భగవత్కైంకర్య మహాత్మ్యము ఇతిహాసోదాహరణ పూర్వకముగానిందు నిబంధించియుండుటవలన నీ గ్రంథము పరమనాస్తికులనుగూడ పరమాస్తికులనుగా నొనర్చుటకు మహోద్భుతశక్తికలిగి విరాజిల్లుచుండెననుట మిథ్యావాదమెంత మాత్రముకానేరదు.

మృదుమధుర రసాప్లుతపదసంఘటనములతో ఆచార్యుల వారి కవితాధార వియద్గంగా ప్రవాహముంబురుడించుచు గ్రంథాంతమువరకు నాకేత్రిరుగా బ్రవహించినది. మరియు విఖనోమునీంద్రుని ప్రాదుర్భావ వృత్తాంతము ఆనందసంహిత మొదలగు సుద్గ్రంథములందు భిన్నభిన్నముగనుండినను ఈ గ్రంథకర్తలగు శ్రీ ఆచార్యులవారు కేవలము బ్రహ్మాండ పురాణమునే ఆధారముగాగైకొని పండితపామర జనమనో రంజకమగుశైలితో పరిసమాప్తి గావించియుండిరి.

ఈ యుత్తమగ్రంథమును ద్వితీయముద్రణముగావించి ప్రజానీకమున కందించి మనస్సంతుష్టిని నేత్రోత్సవమును సమకూర్చినట్టి గ్రంథకర్తగారి పౌత్రులను సర్వదా రక్షించు చుండగలందులకై నాయిష్టదైవమగు శ్రీ శ్రీనివాసమూర్తిని ప్రార్థించుచున్నాడను.

మహోపకారము

"భిషగ్రాజ"

శ్రీమాన్ దీవి వేంకటనరసింహాచార్యులు

సంపాదకులు

శ్రీ వైఖానసభగవచ్ఛాస్త్రగ్రంథమాల, నల్లూరు.

ఉభయవేదాంత ప్రవర్తకులైన శ్రీమాన్ నల్లూరి రంగాచార్యులవారిచే రచింపబడి మీచే ద్వితీయముద్రణముగా ప్రకటించబడిన శ్రీ మదర్చావతార ప్రభావము అను పద్యకావ్యమును చదివించుకొని విని ఆనందించితిని.

ఈ గ్రంథము వినుచున్నంతసేపు మన తాతగారైన రంగాచార్యులుగారు సాక్షాత్కరించినట్లున్నది. దీనిని ప్రకటించి మీరు సంఘమునకు మహోపకార మొనర్చినారు.

ప్రతి పద్యమునందును శ్రీ భగవచ్ఛాస్త్రమున రచయితకుగల సర్వతోముఖపాండిత్యము ప్రకటింపబడుచున్నది. ఆగమశాస్త్రసారాంశము సామాన్యులకుగూడ అందుబాటులో నుండునట్లు ఈ పద్యకావ్యమును వారు రచించి మహోపకార మొనరించిరి. వారు పండితులు మహాకవులు. వారు చిరకాల మర్చించి సాక్షాత్కరింపజేసికొన్న విఖనసార్చిత శ్రీ భావదేవుడు మిమ్ము సదా రక్షించుగాక!

"భావపట్టణవాసాయ - భక్తాభీష్టప్రదాయినే
భానుకోటి ప్రకాశాయ - భావదేవాయ మఙ్గళమ్॥
శ్రీ భూమానసచోరాయ - శేషపర్యంకశాయినే
వైఖానసమునిశ్రేష్ఠపూజితాయాస్తు మంగళమ్॥"

—o—

అనుభూతి

డాక్టర్: శ్రీ బాపట్ల వెంకటచలపతిరావుగారు

వంశపరంపరాధర్మకర్తలు.

శ్రీ భావనారాయణస్వామివారి దేవస్థానం, బాపట్ల.

శ్రీ మదర్చావతార ప్రభావమును రచించినవారు అమరావతిని పాలించిన శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రిప్రభుని ఆస్థానవైద్య విద్వాంసులగు శ్రీమాన్ నల్లూరి తిరువెంగళాచార్యులవారి పౌత్రులు, పండితులు భిషజ్మణులైన శ్రీమాన్ వేంకట్రామాచార్యులవారి పుత్రులు. వీరు గొప్ప పౌరాణిక శేఖరులు. ఆయుర్వేదవైద్య విశారదులుగూడ.

నేను శ్రీవారి దేవస్థానమునకు ఆనువంశిక ధర్మకర్తగా 1920 సంవత్సరమునుండి నా విధులు నెరవేర్చుచు వచ్చితిని. ఈ గ్రంథకర్తగారైన శ్రీ రంగాచార్యస్వామివారు 1928 వ సంవత్సరమున పరమపదమలంకరించిరి. వీరు నాయందత్యంత వాత్సల్యము చూపెడివారు. అంతటి పండిత శేఖరులు శ్రీవారి ఆరాధకులుగానుండుట నాకును, నాతోటి ధర్మకర్తలకు నెంతయో గర్వకారణముగానుండెడిది. వారొనరించెడి విశేష కైంకర్యములతో పాల్గొని ఆనందించెడివారము. వీరితోడ్పాటు వలన ఆలయాభివృద్ధికూడా చేయగలిగితిమి.

1809 సంవత్సరములో శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడుగారిచే శ్రీవారి సన్నిధిన ప్రతిష్ఠించిన కీర్తిధ్వజమునకు ది 18-12-1922 న తామ్రకవచ సమర్పణము, తరువాత శ్రీవారి వాహనములన్నిటికి పునఃప్రతిష్ఠా కార్యక్రమ నిర్వహణము, వాహనశాల నిర్మాణము, ఆలయప్రాంగణమున

కళ్యాణమంటపమున నాపరాళ్ళను పరిపించుట - పాకశాల నిర్మాణము - ప్రత్యేక కూపనిర్మాణము మున్నగునవి వీరి తోడ్పాటుకు నిదర్శనములు. శ్రీ ఆచార్యులవారు ప్రతినిత్యము స్వామి సన్నిధిన పురాణ కాలక్షేపము చేయుచు శ్రీవారి వైభవాదులనుగూర్చియు, సంప్రదాయములనుగూర్చియు ప్రబోధించెడివారు. వీరిగ్రంథమునేగాక శ్రీ భావనారాయణస్వామి వారి స్థలప్రభావము, శ్రీహరినామ కీర్తనలు, ఎదురుకోల రాయబారము, తిరుమంగయాళ్వారు చరిత్రము మున్నగు వానినిగూడ రచించి శ్రీవారికంకితమొనర్చి ముద్రించి యుంచిరి.

డెబ్బదిసంవత్సరముల క్రిందట ముద్రితమైన ఈ గ్రంథము మృదుమధుర పౌరాణిక శైలిగలదై రసపూరితమై విరాజిల్లుచున్నదనుట అతిశయోక్తి కాదు. మహాకావ్యలక్షణ లక్షితమై యలరారుచు భక్తిప్రపత్తుల కాలవాలమై నాస్తికులను సైతము దయా, సత్యశౌచ ధర్మనిరతులగావించి భగవత్సేవా పూజాదుల యందభిముఖుల గావించుటకీగ్రంథమెంతయో తోడ్పడుచున్నది.

గ్రంథకర్తగారి పౌత్రులైన గౌతమసోదరులు ద్వితీయ ముద్రణగావించుటెంతయో ముదావహము. స్వయంవ్యక్తులైన శ్రీ భావదేవుడందరిపై తన అపారమైన అనుగ్రహ ప్రసాదమును స్రవింపజేయుగాకయని మనసార స్తోత్రమొనరించుచున్నాడను.

" శ్రీ భావదేవచరణౌ శరణం ప్రపద్యే "

భగవత్సంకల్పము

శ్రీ కర్లపాలెం రామకృష్ణమూర్తి

రిటైర్డు హెడ్మాష్టరు, బాపట్ల.

శ్రీ మదర్చావతార ప్రభావమను గ్రంథమును చూచెడి భాగ్యము గల్గినందులకు సంతోషము. శ్రీ రంగాచార్యులగారు మా కుటుంబమునకు చాల సన్నిహితులు. వారు శ్రీ భావనారాయణస్వామివారి ఆరాధకులేగాక ఆయుర్వేదమున ప్రథమశ్రేణి వహించిన వైద్యశిఖామణులు కూడా. శ్రీ తిరుమల వేంకటేశ్వరస్వామికి కృతినర్పించి తరించిన అన్నమాచార్యులుగారెటులనో! వీరును నట్లే శ్రీ భావనారాయణస్వామివారికి కృతినర్పించి తరించిన భక్తాగ్రేసరులలో నొకరు.

ఈ గ్రంథము యొక్క కథా ప్రారంభమునందు కవి "బౌద్ధ పాషండమతములు ప్రబలె భువిని" యని వాక్రుచ్చియున్నారు. అనగా అప్పటికే ప్రజలలో విభిన్న బుద్ధులు గల నాస్తిక ప్రచారకులు, పాషండులు ప్రబలియున్నారని విదితమగుచున్నది. బౌద్ధమనగా సాధారణముగా జన బాహుళ్యమున బౌద్ధుని చే స్థాపించిన మతమని తలచుట సహజము. అట్టిది కవి యుద్దేశ్యమైయుండదు. "బుద్ధిః కర్మానుసారిణీ" అను నార్యోక్తి ననుసరించి మూఢులైనవారు పరమాత్ముని విస్మరించి నాస్తికులై తమ బుద్ధ్యనుసారమే ప్రవర్తించు మతము బౌద్ధమతముగ గ్రహింపదగి యున్నది.

అట్టి నాస్తిక మత విధ్వంసనమొనర్చి ఆస్తికత్వము పెంపొందింప జేసి మనలను తరింపజేయుటకై నారదుడొనర్చిన ప్రయత్న మీ కథాభాగమునద్యోతకమగుచున్నది. నాటి నారదుని ప్రయత్నఫలమే నేడు మనము దిలకించుచున్న అర్చామూర్తుల వైభవము.

భక్తాగ్రేసరులగు శ్రీ రంగాచార్యులగారు ఇప్పటికి షుమారు 70 సంవత్సరములకు క్రిందట రచియించి ప్రథమ ముద్రణ గావించిన ప్రతులు కాలగతినిమఱుగై; నేటికి బౌద్ధ పాషండములు తిరిగి తలఎత్తుచున్న ఈ తరుణమున ఇయ్యది వెలుగునకు వచ్చి ద్వితీయ ముద్రణము గావించబడుట భగవత్సంకల్పము.

భావనాతీతుడగు భావదేవుడు కర్తకు - పరిచరణ కర్తలకు - పోషకులకు - సమారాధకులకు సకలాభీష్టముల నొసగి కాపాడు గాక!!

—o—



కావ్య వైభవము

"మధురకవి"

శ్రీమాన్ పణ్డిత బృందావనం రంగాచార్యులు, పసుమూరు.

'శ్రీ పాదర్చావతార పరిభావము' మూడాశ్వాసముల మధురకావ్యము. కర్త డెబ్బదియేండ్లు క్రిందటి వ్యక్తి. అయినప్పటికిని కవిత యత్యాధునిక శైలీపరిమళముల వెదజల్లుచుండుట విశేషము.

రచయిత యీ గ్రంథమును రచింపబూనునాటికి పద్యరచనలో నవీనత యింతగ నెలకొనలేదు. కోమలపద పారిజాతములకూర్పు - మధుర మందార మకరందధారా ప్రసార సదృశ భావోద్ధతి - అర్చావతార పరిభావకవితావాహిని యందంతర్వాహినులుగ ప్రవహించుచున్నవి.

సమకాలీన పద్యరచనా పద్ధతికి భిన్నమైన వైఖరిలో - ఇంతమార్దవమును; సొగసును; మంజులతను; రంజకతను కవితలో ప్రస్ఫురింపజేయగల్గుట - కవియొక్క విలక్షణ మనోహర సలక్షణ సహజకవితా లక్షణమునకు దార్కాణము.

వరపక్షినసమాసీంద్రుడు
సురుచిరముగ నుద్భవిల్లె శోభితుడగుచున్
సురలెల్ల బుష్పవృష్టిని
గురియించిరి ఋషులకెల్ల కోరికలలరన్

ఇభవరదు! సుప్రతిష్ఠా
విభవము వినినంత నాకు వేడ్కమనమునన్
బ్రభవించె నింక డెల్పవె!
శుభకరమగు తచ్చరిత్ర సుగుణగరిష్ఠా!

మొదలయిన పద్యముల గొన్నింటిని మచ్చుతునకలుగ జూపినను గ్రంథమునందంతట నిట్టి కవితయే సౌరభముల గుబాళించుచున్నది. కవిగారికి - అంత్యానుప్రాసలపై మంచి యధికారముగలదు.

శరధిసుతాలయవక్షా!
పురుహూతాద్యమరరక్ష! భువనాధ్యక్షా!
కరిరాజవరదదక్షా!
నిరుపమకరుణాకటాక్ష! నీరేజాక్షా!

శ్రీరమణీహృదయేశ్వర!
నీరదగంభీర! సర్వనిగమాధారా!
కారుణ్యామృతపూరిత
ధీరా! బాపట్లవాస! దివ్యవిలాసా!

ప్రౌఢశైలిలో కవిత నల్లగలశక్తియు రచయితకుగలదని నిరూపించుటకీక్రింది యుదాహరణమును బేర్కొనవచ్చును.

"చండప్రస్ఫుటబాహుదండ ఘనరక్షశ్శిక్షణోద్దండ బ్రహ్మాండాంతఃప్రతిభాస భాసురశుభానందైకరూపావహో ద్దండప్రక్రియమూలకారణవిశుద్ధాత్మా! ప్లుతాత్మా! శాశ్వతా! చండాంశుప్రతిభ ప్రకాశజగదీశా! భావనారాయణా॥"

గ్రంథకర్తగారి వచన రచనయు ప్రశంసనీయ సరళిలో నడచినది.

శ్రీ విఖనసాచార్యస్వామివారి ప్రాదుర్భావమును గురించి - అర్చావతార వైభవమును గురించి ఉత్సవవిశేషములను గురించి యిట్టిమధుర పాకమున గ్రంథరచన గావించిన కీర్తనీయులు కీర్తిశేషులు శ్రీమాన్ నల్లూరి రంగాచార్య స్వామివారు ధన్యతములు పూజ్యచరణులు - శ్రీ భావదేవ దివ్యానుగ్రహపాత్రులు.

ఈ కృతిని పునర్ముద్రణ మొనర్పనుద్యుక్తులయిన గౌతమ సోదరులు సంకల్పసిద్ధులు.

శ్రీ మదర్చావతార ప్రిభానము

బాపట్ల పురనివాసున
కాపద్బాంధవున కన్యయానందునకున్
పాపౌఘభంజనునకును
దీపితగాత్రునకు భావదేవేశునకున్.

సభక్తికముగ నంకితమీయబడి నల్లూరి వంశమున కజరామరకీర్తిని ఘటించినది.

శుభమ్

"జయన్తితే సుకృతినోరస సిద్ధాః కవీశ్వరాః"

ఓమ్

శ్రీరస్తు   శ్రీయైనమః   శుభమస్తు



-: శ్రీ మదర్చావతార ప్రభావము :-

శ్రీమత్సుందరవల్లి రాజ్యరమతో శృంగారవేషమ్ముతో
నామోదంబున భక్తరక్షణకు తానర్చాస్వరూపంబు స
త్ప్రేమం దాల్చి విశేషవైభవము శోభిల్లంగ బాపట్ల స
ద్ధాముండౌ వర భావదేవుని మదిన్ ధ్యానింతు నశ్రాంతమున్.

కలుము లెప్పుడు శంకర కమలసంభ
వాది సురులకు నొసగుచు నవ్యయముగ
మొలకనవ్వులు మోమున గులుకులక్ష్మి
చెలువమలరగ మమ్ము రక్షించుగాత.

ఘనవిఘ్నాంధ దివాకరు
ననఘున్ కరుణాసముద్రు నాశ్రితభద్రున్
ఘనవిష్వక్సేనుని మది
ననయత స్మరియింతు కావ్యచతురతగలుగన్.

సనియతి నాగమశాస్త్రం
బును విరచించియు స్వసూత్రమున కాద్యుండౌ
ఘనుడగు విఖనసమునివరు
మనమున నేసంస్మరింతు మనువక నెపుడున్.

మదివాల్మీకి మహాత్ముని
సదమలమతు లాంధ్రకవుల సన్నుతిజేతున్
బెదరక కుకవుల నెల్లను
వదలక నిరసింతు కావ్యవంచకులగుటన్.

ఆర్యులువోగడ నృసింహా
చార్యులు తత్సోదరుండు సన్నుతి రామా
చార్యులు సత్పండితు లా
దార్యుల గురువులను దలతు ధరనగ్రజులన్.

వ- అని యివ్విధంబున నిష్టదేవతానమస్కారంబును సుకవి పురస్కారంబును కుకవితిరస్కారంబును గావించి,

శ్రీవైఖానస సత్కులార్ణవశరత్శీతాంశుడు ద్య ద్య శః
ప్రావీణ్యుండు హరిప్రియార్చనుడు దుష్పాపౌఘదూరుండు నా
నా వేదస్మృతిశాస్త్రకోవిదుడు శ్రీనల్లూరి వంశంబునం
దావిర్భావముజెందె మున్ను నరసింహాచార్యనామంబునన్.

ఆఘునునకు బుత్రుడై జనించెను తిరు
వేంగళాచార్యు లనంగ భువిని
బాలచంద్రునిరీతి బ్రబలుచు శాస్త్రార్థ
సార సంగ్రహముల చతురుడగుచు
నరసమాంబయనెడి నారీమణిని బెండ్లి
యాడి సుఖంబుల ననుభవించి
అగణితకీర్తిచే నతిశయిల్లుచు మది
బాయకధర్మముల్ బరగజేసి

భాసిలుచుతాను వాసిగ వాసిరెడ్డి
వేంకటాద్రిప్రభువు చేత విభవములను
సాటిలేనట్లుగా నొంది సకలజనుల
పాలిటికి కల్పభూజమై పరిఢవిల్లె.

ఆయనకు సుతుడు వేంక
ట్రాయాచార్యులు జనించి రాజిల్లుచు న
త్యాయతపండితకవిత సు
ధీయుతుడై జగతిబరగె స్థిరతరకీర్తిన్.

సతులలోపల బతివ్రతయు మిక్కిలిగుణా
 వతియు సంతతధర్మమతియు సుజన
హితచరిత్రయు భాగ్యవతియు స్వాంతమున శ్రీ
 పతి నేమరకయుండు సద్వతియైన
సతిజానకమ్మను హితమతి బెండ్లాడి
 యతులసౌఖ్యంబుల నతిశయిల్లి
సుతునిగాంచిరి నన్ను సుజనులుపొగడంగ
 ఘనత రంగాచార్యులనెడి వాని
నిపుడు శ్రీభావదేవ నీకృపలభింప
నమ్మి నేనీ ప్రబంధంబు నయతజెప్పి
నీకునర్పణజేసెద నేర్పుతోడ
దీనిగైకొమ్ము మునిహిత దివ్యచరిత.

షష్ట్యంతములు.

ఏవంవిధగుణనిధికిని
సేవకనుతచరిత సతతచిన్మయనిధికిన్
భావైకబోధ పధికిని
లావణ్యరసాంబుధికిని లక్ష్మీపతికిన్.

రామునకు సకలజగదభి
రామునకు సమస్తభవవిరామునకు ఘన
శ్యామునకు మానిమానస
ధామునకు రమామణీహృదయరమ్యునకున్.

బృందారకవందితున క
మందానందైకభావనాతీతునకున్
సుందరదేహునకును ఘన
మందరనగధీరునకు రమారమణునకున్.

బాపట్లపురనివాసున
కాపద్బాంధవున కవ్యయానందునకున్
పాపౌఘభంజనునకును
దీపితగాత్రునకు భావదేవేశునకున్.

వ- సమర్పితంబుగా నాయొనర్పంబూనిన అర్చావతార
ప్రభావంబను మహాప్రబంధమునకు కథావిధానంబెట్టిదనిన,

—: క థా ప్రా రం భ ము :—

నారదుడొకనాడు నలువసన్నిధికేగి
ప్రణుతుడై కోర్కెచే బలికెనిట్లు
ఆదినారాయణు డర్చాస్వరూపంబు
గైకొనుటకు నేమికారణంబు ?
తచ్చరిత్రము నాకు దగదెల్పు మనవుడు
వినువత్స ! జెప్పెద వేడ్కతోడ
నామహాత్మ్యచరిత్ర మద్భుతంబై యొప్పు
దెలియజెప్పెదనీకు తేటపడగ

నిశ్చలంబుగ జిత్తమునిల్పి భక్తి
తోడనీకథ వినినను దోషహారము
జ్ఞానవైరాగ్యసంపద గలుగుననుచు
జెప్పబూనెను నారదుచిత్తమలర.

సర్వలోకములకు కీడు సంభవింప
మానిజనములు విబుధులు మదిని భీతి
నొందినను గాంచి మ్రొక్కుచు నోమహాత్మ !
బౌద్ధపాషండమతములు ప్రబలెభువిని.

పరమాత్మని మదిదలచక
నిరతము కుటిలస్వభావనిర్ణయులగుచున్
వెరువక ధర్మము సత్యము
లరయగ విడనాడి దుర్మదాంధులరగుచున్.

కరుణ యొకించుక లేకయు
దురితాంబుధిలోన మునిగి దుర్ణయులగుచున్
నరులిటు వర్తించుటచే
ధరదుర్భిక్షంబునొదవె దానమహాత్మా!

అనుచు సుపర్వాణులు వర
మునిసంఘము బలుక నేను బుద్ధినియటయో
చన జేసి దీనిదీర్పగ
వనజాక్షుడుదక్క నితరవారలకగునే!

వ- అని మనంబున వితర్కించి ఏకాంతప్రదేశంబునకున్ జని నిర్మలచిత్తుండనై యటకుశాజినంబులన్ జేసిన స్వస్తిక ప్రముఖాసనంబునన్ గూర్చుండి యమ నియమ ప్రాణాయామ ప్రత్యాహారధ్యాన ధారణ సమాధినిష్ఠల చే రేచక పూరక కుంభక త్రివృత్ప్రాణాయామంబున ప్రాణేంద్రియ మనోబుద్ధి చిత్తంబుల నేకాగ్రింబుజేసి ప్రణవార్థప్రతిపాదకుడును, "నిష్కళంక నిరంజన నిర్వికల్ప నిరాఖ్యాత శుద్ధో దేవ ఏకో నారాయణః" అనెడు నారాయణోపనిషద్వాక్యార్థ సారవిచారణీయుండును "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ" అనెడు శృత్యర్థము ననుసరించి అవాఙ్మానస గోచరుండును వేదాంతవేద్యుండును నగు శ్రీమన్నారాయణుని బురుషసూక్తవిధానంబునన్ ధ్యానంబొనరింప నాభక్త వత్సలుండు"

హారకిరీటకేయూరసన్మణిమయ
కుండలసంశోభితుండు శంఖ
చక్రగదాపద్మసలలితహస్తుండు
కంకణనూపురాలంకృతుండు
మహితకాంచీకటిమండలుండాశ్రిత,
రక్షణు డమలుండు రమ్యతనుడు
కౌస్తుభశ్రీవత్సకమనీయసౌరభ,
గ్రైవేయవనమాలకలితవక్షు
డజుడు మహనీయదివ్యపీతాంబరుండు
సచ్చిదానందమయుడు లక్షణయుతుండు
సతతలోకశరణ్యు డాశ్రితధనుండు
అమలసద్గుణశోభితుం డవ్యయుండు.

నిగమాగమసంవేద్యుం
డగణితభవరోగవైద్యు డాశ్రితభద్రుం
డగు సర్వసాక్షి పరుడగు
భగవంతుడు నాకుగానబడె సత్కరుణన్.

వ- ఇట్లు సాక్షాత్కరించిన నయ్యిందిరాసుందరీవదనారవింద
మరందరసాస్వాదితాభిలాషమత్తమధుకరుండగు నప్పరమే
శ్వరునకు పునః పునః ప్రణామంబులాచరించి నిటలతటఘటి
తాంజలిపుటుండనై అనేకవిధంబుల సేవించి,

వందనము దీనరక్షా !
వందనము సురారిశిక్ష ! వనజదళాక్షా !
వందనము మానిపక్షా !
వందనము కటాక్షవీక్ష ! వరగుణదక్షా !

వ.. ఏనమ్మహాత్ముని బహుప్రకారంబుల సంస్తుతించి యిట్లంటి, దేవా ! నావిన్నపంబవధరింపుము. ధరాతలంబున దురాత్ములగు బౌద్ధపాషండచార్వాకప్రముఖమాయావాదులు ప్రబలి జ్ఞానశూన్యులై, వేదశాస్త్రపురాణాదుల యందసూయాపరులై, దయాసత్యశౌచ ధర్మంబులయం దిచ్ఛారహితులై, భగవత్సేవాపూజాదులయందువిముఖులై; యిచ్ఛాపరివర్తనంబున వర్తిల్లుటంజేసి సకలలోకంబులకు క్షామాడంబరాదిప్రజాబాధలొదవెంగాన జగత్పీడానివారణంబొనరించి లోకంబులకు క్షేమంబొసంగి స్వల్పజ్ఞానసహితులైన మానవులకు సులభోపాయంబుగ మోక్షంబొసంగి రక్షింపుండని ప్రార్థింప నాజగద్రక్షకుండగు లక్ష్మీనారాయణుం డక్షీణ కృపాకటాక్షవీక్షణాలంకృత చక్షుండై యిట్లనియె, ఓవత్సా ! "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అనున్యాయంబున ఏను పరవ్యూహవిభవాంతర్యామ్యర్చావతారంబులన్ గైకొని దుష్టనిగ్రహ శిష్టప్రతిపాలనంబొనరించి ధర్మంబుసంస్థాపించితిని. ఇప్పుడు లోకంబులకున్ గలిగిన క్షామోపద్రవాది ప్రజాపీడలడగించి దుష్టాచారంబుల భ్రష్టులై చెడియెడు నికృష్టమానవుల

మద్దర్శన కైంకర్యాదులచే శిష్యులగుటన్ జేసి మోక్షం బొసంగుటకు ఏనర్చావతారస్వరూపుండనై యవతరించెదం గాక యనియానతిచ్చి మరియు నిట్లనియె-

శ్రీభూదేవీయుతముగ
నీభువి నర్చాస్వరూపమేదాల్చి లస
త్ప్రాభవమొందెద గావున
శోభితసుజ్ఞాననిపుణు సుగుణగరిష్ఠున్.

వేదవేదాంతకోవిదు విమలమతిని
సర్వశాస్త్రాగమాధ్యుని శాంతగుణుని
యనఘచరితుని సత్యదయానిరతుని
మానినమ్యుని సదయుని మాన్యఘనుని.

మత్పూజార్థంబిప్పుడు
సత్పురుషుని నీదుసృష్టిచతురత మెరయ
న్నుత్పత్తి జేయుమనుచు జ
గత్పతి బల్కగ తదాజ్ఞగైకొని వేగన్.

వ- జ్ఞానసమాధినియతుండనై "విష్ణుస్సర్వేషామధిపతిః పరమఃపురాణః" అనెడు శృత్యర్థస్వభావుండును సర్వదేవోత్తముండును సర్వజగత్పరిపూర్ణుండును దివ్యమంగళవిగ్రహుండును సగు శ్రీమన్నారాయణుని హృత్కమలకర్ణికాపీఠంబుననిల్పి విశేషమనోఖననంబు గావించిన.

నరవిఖనసమహానీంద్రుడు
సురుచిరముగనుద్భవిల్లె శోభితుడగుచున్
సురలెల్ల బుష్పవృష్టిని
గురియించిరి ఋషులకెల్ల కోరికలలరన్.

అంతటనమ్మునిచంద్రుని
సంతసమునగూడి, శౌరిసన్నిధికే న
త్యాంతముదంబునజని యా
కంతుజనకు దివ్యపాదకంజంబులకున్.

వ- అభినందనంబొనరించి,

భవదీయాజ్ఞ శిరంబున
సవినయముగ దాల్చి దేవసంఘముపొగడన్
భవదూరు మత్సదృశు ను
ద్భవమొనరించితి మహాత్మ! పరమమునీంద్రున్.

అనియిట్లు విన్నవించిన
వనమాలిముదంబునొంది వాత్సల్యమునన్
ఘనుడగు విఖనసమునివరు
గనుగొని తాబల్కె పరమకౌతుకమెసగన్.

ఓమునిసార్వభౌమ! ముదమొప్ప స్వసూత్రి మొనర్చి తద్విధిన్
మామకభవ్యపూజలను మాన్యతజేయు సభక్తికంబుగా
నీమహియందుగల్గు భవదీప్సితమంచునుబల్క నమ్రుడై
మోమునసత్కరద్వయము మోడ్చినుతించి మునీంద్రుడిట్లనెన్.

నేధన్యుండ గృతార్థుడన్ తమకృపన్నిక్కంబు సద్భక్తి నా
రాధింపంగ స్వసూత్రసన్నిధిని మీ రర్చాస్వరూపంబు లో
కాధారంబుగ గొందు దేవ! యనినన్ హస్తస్పృశన్ జేసి నీ
వాధిక్యుండవు మానిసంఘములయందంచున్ గృపాదృష్టిచేన్.

అనఘ! యాఘనవృత్తిచే నరయనీకు
జీవనార్థంబు మోక్షసంసిద్ధిగలుగు
వేదసమ్మత కైంకర్యవిధులొనర్పు
మగ్నినర్చాముఖంబులనారగింతు.

నీదుసూత్రప్రవర్తకుల్ నిపుణులగుచు
ఘనతనొందెదరవని వైఖానసులరు
గాన మత్పూజకర్తలు నేనువారి
నెల్ల కృపతోడ జూచెదనుల్లమలర.

విఖనసమునివర్య! వినుము దెల్పెదనీకు
వివిధజనమ్ములు వేదమునను
స్వర్గకామోయజస్సర్వమ్మనను నది
నమ్మి యగ్నిముఖంబున నమరవేల్చి
అశ్వమేధాదికంబగు యజ్ఞవితతిని
క్రమముగజేసి స్వర్గంబుజెంది
భోగంబులగమించి మోక్షమించుక లేక
వ్యర్థులయ్యెదరిది సార్థకంబు

నీదుసూత్రజ్ఞులెప్పుడు నిశ్చలమతి
త్రికరణంబుగ మామకదివ్యయాజ
కత్వమున నాశరహితమౌ ఘనపదంబు
నొందెదరు నాదుకృపచేతనో మునీంద్ర !

మరియును వినుమొక సరణి దెల్పెదనీకు
బౌద్ధపాషండచార్వాకజనులు
లోకంబునను దుష్టలోలురై దిరుగుచు
భవమునార్జించు తత్పరత దుష్ట
నరులను సేవించి పరమార్థముత్యజించి
ధనమునార్జించుచు మనుచునుండు
నట్టివారలనెల్ల నరసి నేవంచించి
ఘోరనరకంబులగూలజేతు
నరయ నీసూత్రవర్తను లయినవారు
నాదుకైంకర్యముల నెల్ల నయతజేసి
జనులకెల్లను మద్భక్తిసరణి దెల్పి
మత్కృపకు పాత్రులగుదురు మౌనిచంద్ర !

వ- అని తావకసూత్రజ్ఞులగు వైఖానసులకు మదర్చనా విధానంబు పరమధర్మంబుగాన కైంకర్యార్థంబు మత్సాన్నిధ్యంబునకరుగు సమయంబున స్నానాదికృత్యంబులు నిర్వర్తించి కేశవాదిద్వాదశనామంబులచే క్రమంబుగ ద్వాదశోర్ధ్వ పుండ్రంబులుధరించి మదాలయ ప్రదక్షిణం

బొనరించి బలిపీఠంబుకడ ప్రణామంబాచరించి మత్సన్నిధి కరిగి యటగూర్మాసనంబునన్ ప్రాణాయామపరుండై గూర్చుండి, గుణత్రయంబు మనోబుద్ధిచిత్తంబులు మదధీనంబులుగావించి, మదర్పితసకలేంద్రియసర్వకర్మసంశీలురై త్వత్కృతసూత్రోక్తవిధానంబుగా నన్నర్చించి; మత్ప్రసాదంబున్ భుజియించి మత్కృపకున్ బాత్రులై భుక్తిముక్తి ఫలపరిగ్రహులగుచు సుఖంబునొందెదరు. లోకంబున నవిద్యాపరతన్ బరివర్తిల్లు ముక్తిహీనులగు మానవులనెల్ల మత్సేవాకైంకర్యాది కృత్యంబులచే వారిన్ బావనులన్ గావించి మద్భక్తవరులన్ గానొనర్చి తామునుగృతార్థులయ్యెదరని పల్కి మరియు నిట్లనియె

భూజను లెవ్వరైనను మ
ద్యాజకులగు మీకు భక్తినర్థ మొసగినన్
యీజగతి యశముగని వట
బీజమువలె గాంచగలరు పెంపున్ సొంపున్.

వ- అని యివ్విధంబున ననంతకళ్యాణగుణపరిపూర్ణుండగు శ్రీమన్నారాయణుండు కృపాకటాక్షవీక్షణామృతంబు వెల్లివిరియ నవ్విఖనసమునిపుంగవునితో నానతిచ్చిన,

అని యబ్జజుడెరిగించిన
విని నారదమునివరుండు వేడ్క సుమతియై
ఘనమగు నీసుచరిత్రం
బనఘా! యావలను దెల్పుమని యడుగుటయున్.

ఆశ్వాసాంతము.

శ్రీకారుణ్యరసాబ్ధిపూర్ణవిలసత్ శ్రీమార్గలోకావనా!
సాకారామల నిర్వికారపరసత్వానందశశ్వత్సుఖా!
పాకారి ప్రముఖార్చితాంఘ్రియుగ! దుష్పాపౌఘసంహారణా!
శ్రీకాంతాహృదయాబ్జమత్తమధుపా! శ్రీ భావనారాయణా!

శరధిసుతాలయవక్షా!
పురుహూతాద్యమరరక్ష! భువనాధ్యక్షా!
కరిరాజవరద దక్షా!
నిరుపమకరుణాకటాక్ష! నీరేజాక్షా!

మాలిని- సరసిజదళనేత్రా! చారులక్ష్మీకళత్రా!
వరదశుభచరిత్రా! భక్తహృత్కంజమిత్రా!
పురహరనుతపాత్రా! భూరిలావణ్యగాత్రా!
దురితలతలవిత్రా! దోఃప్రతాపైకచిత్రా!!

గద్య

ఇతి శ్రీభావనారాయణ కృపాలలితకటాక్షవీక్షా సమాసాదితానవద్య కవిత్వవిద్యా విరాజమాన నల్లూరివంశ పయఃపారావారరాకా సుధాకరాయమాన గౌతమస గోత్రపవిత్ర వెంకట్రాయాచార్యపుత్ర సుకవిజనవిధేయ రంగాచార్యనామధేయ ప్రణీతంబైన శ్రీమదర్చావతార ప్రభావంబను మహాప్రబంధంబునందు ప్రథమాశ్వాసము-సంపూర్ణము.



శ్రీ మదర్చావతార ప్రభావము

ద్వితీయాశ్వాసము

శ్రీలక్ష్మీకుచకుంకుమ
మేళనశృంగారవక్ష! మేదినిరక్షా!
బాలేందువదనకాంచన
చేలా! బాపట్లవాస చిన్మయభాసా.

అవధరింపుము పద్మసంభవుడు వేడ్క
మదినిరంజిల్ల నారదమౌనివరుని
గాంచి యిట్లనిపల్కె నాథునమునీంద్ర
చంద్రుడంతటపలికె నుపేంద్రుజూచి.

వ- దేవా! భక్తివైలక్షణ్యంబెరింగింపుడని వేడిన నమ్మహాత్ముండు:-

మామకభక్తిలక్షణము మానుగ రెండువిధంబులై తగున్
భూమిని బాహ్యమంతరము ముఖ్యములందులనొప్పుబాహ్యమున్
మోమున శ్వేతమృత్తిక ద్విపుండ్రముగాధరియించి మధ్యశ్రీ
ధామమునైన చూర్ణమును దాల్చిననున్ దగపూజజేయుటల్.

అంతరంబుననొప్పు నన్నాత్మలోన
ధ్యానవిన్నాణముఁగనిల్పి తగ మనస్సు
కాయవాక్కర్మముల నొక్కటిగనుజేసి
నిశ్చలజ్ఞానసిద్ధిచే నిలుచుటగును.

వ- అని విఖనసఋషితోడన్ దెల్ప ఏనమ్మహాత్మునింగాంచి అంజలీపుటవిన్యస్త మస్తకుండనై యిట్లంటి,

ఆరయలోకమందు శుభదాకృతి శ్వేతమృత్తికన్ సదా
ధారణజేయుమార్గమును తద్భవమాదిగ నాచరిత్రముఁన్
కూరిమితోడ దెల్పుమని కోరిన సత్కృపచేతనిట్లనెన్
సారససంభవా! వినుముజక్కగ దెల్పెదనంచు ప్రేమతోన్.

మునునే శ్వేతద్వీపం
బున వనలీలావిహారమును జేయుచు న
త్యనుపమ శ్వేతమృత్తిక
ఘనకుధరంబులకు నచట గనుగొని వేడ్కన్.

వ- సంతతమదీయయాన సంవిధాన పాత్రుండగు వినతా పుత్రుంగని యిట్లంటి నేతద్వీపవాసులగు మదీయాంతరంగ భక్తులెల్ల మత్పాదంబుల బాహ్యాభ్యంతరంబుల సంతత ధ్యానధారణానందంబులన్ జెంది మోక్షసంసిద్ధినొందుటకు చిహ్నంబుగా నీ శ్వేతమృత్తికాకుధరంబులనెల్ల మున్ను

త్వ త్తిజేసితిన్ గాన నీవిపుడీ శ్వేతమృత్తు కానగంబుల నవలీల
నీమూపునన్ ధరియించి భూలోకంబున నచ్చటచ్చట
విచ్చలవిడి నిక్షిప్తంబు జేయుమన మదాజ్ఞాప్రవర్తన
శీలుండగు నవ్విహంగపుంగవుండవ్విధంబునన్ గొని చని
ధరాతలంబుననుచిత ప్రదేశంబుల లీలావిలాసంబుననుసిచెన్
గాననో చతురాననా! పవిత్రంబగు నా శ్వేతమృత్తిక
స్వరూపసిద్ధాంత ప్రవర్తకులగు మద్భక్త జనసముదయంబు
లకు ధారణా యోగ్యంబై విలసిల్లినెట్లనిన సుప్రక్షాళిత
ముఖమండలంబునన్ ద్వంద్వబోధితంబుగా మత్పాద
ద్వయాకృతిన్ వేణుపత్రాకృతిన్ శూర్పాకారంబుననైన
నూర్ధ్వపుండ్రంబు ధరియించి తన్మధ్యంబున
“నాసికాదిలలాటాంతం హారిద్రాచూర్ణమిశ్రితం”
అనున్యాయంబున హారిద్రామిశ్రిత శ్రీచూర్ణధారణంబు జేసి
కేశవాదిద్వాదశనామంబులచే సక్రమంబుగ ద్వాదశోర్ధ్వ
పుండ్రంబులన్ ధరించి తులసిమాలికావిభూషితవక్షులై
కరకలిత పద్మాక్షమాలాలంకృతులై జిహ్వాగ్రంబున
మామక దివ్యమంత్రద్వయంబనారతంబభివర్ణించుచు
మదర్చా స్వరూపంబు సేవించుచు మత్కైంకర్యాదులన్
గావించి మోక్షసంసిద్ధినొందెదరని భక్తిలక్షణంబెరింగించి
తిరుమంత్రద్వయరహస్యార్థోపదేశంబు జేసి ధన్యులంగావిం
చిన సమ్మునిపుంగవుండత్యంతానందంబున నాలోకారాధ్యు
ననేకవిధంబుల భావించి, సేవించి, కీర్తించి, షోడశోప

చారంబులచే నర్చనాదికైంకర్యంబులొనరించి యానంద సాగరంబున నోలలాడుచుండ నా దేవదేవుండా సంయమీంద్రున్ జూచి, మాచే మూలమంత్రరహస్యోపదేశంబునొందితివిగాన పూర్ణవైష్ణవుండనన్ బరగినవాడవని పలికి, ఏనుబదరికాశ్రమంబాదిగా బుణ్యస్థలంబులయందర్చావతార స్వరూపుండనై వేంచేసెదన్ గాన నీవును శీఘ్రంబున బదరికాశ్రమంబున కరుగుమని యానతిచ్చి నన్నుంగాంచి నీనివాసంబున కేగుమని యాజ్ఞనొసంగి తానంతర్హితుండయ్యె నంత నాఋషివర్యుండు ముదంబున బదరికావనంబునకున్ జనియె. ఏనును దేవముని సంఘంబులు గొలువ సత్యపదంబున కరిగితిని. పితామహుండు చతురవచన రచనా విశారదుండగు నారదున కెఱింగించి యోవత్సా! అర్చావతారంబునందు స్వయంవ్యక్త, దైవిక, సైద్ధిక, మానుషంబులన నాలుగు విధంబులాయా బుణ్యస్థలంబుల నామంబులు సంక్షేపముగా నీకెఱింగించెద వినుమని యిట్లనియె-

ధర బదరికాశ్రమంబును;
వర శేషనగోత్తమంబు; వారాహంబున్
గరుడాద్రియు నారాయణ
ధరణీధరవరము మరియుతగనైమిశమున్.

శ్రీకరమనంతశయనము
ప్రాకటసింహాచలంబు వాసవనగమున్
శ్రీకూర్మము శ్రీరంగము
నాకరమై వెలయు హరిస్వయంవ్యక్తమగున్.

ఘనమగు ద్వారకాపురము కాంచిపురంబును ఖండికాపురం
బును వృషభాద్రిమారుతసుభూధరమున్ దగనశ్వతీర్థమున్
వినుతసుచక్రతీర్థమును వేదపురంబును విష్ణుతీర్థమున్
అనఘచరిత్ర! దైవికసమాఖ్యవహించు జగత్ప్రసిద్ధిగన్.

తామ్రపర్ణియు మధుర సత్యాచలంబు
ఘటికగిరి చిత్రకూట మిత్త్వావనంబు ।
వ్యాసతీర్థంబు పాండుపర్వతము నివియ
సైద్ధికములన నొప్పును సంయమీంద్ర!

ధర నాల్గువర్ణములయం
దరయగ సద్భక్తియుక్తులైన నరులు శ్రీ
హరిని బ్రతిష్ఠించిన ముని
వర! మానుషములు ననంగ భాసిలుచుండున్॥

వ- అని మరియు బదరికాశ్రమంబున నత్పాస్వరూపుండై
యవతరించిన నారాయణునకారాధనాదికైంకర్యంబులొన
రించుచునుండు విఖనసఋషిపాలికి భృగు, మరీచ్యత్రికశ్యపాది

ఋషులే తెంచి వారికిన్ ప్రియశిష్యులై వారివలన వైఖానస సూత్రంబును శ్రీవిష్ణు దివ్యాగమశాస్త్రంబును నాద్యంతంబుగా గ్రహియించి తత్సంప్రదాయ ప్రవర్తకులగుచు కర్షణాది ప్రతిష్ఠాంతంబు మొదల అర్చనాద్యుత్సవాంతంబు వరకు భృగుప్రోక్తమని, మరీచిప్రోక్తమని, అత్రిప్రోక్తమని, కశ్యపప్రోక్తమని చతుర్విధంబులుగా వైఖానసఋషి ప్రతిష్ఠితంబగు దైవాగమ శాస్త్రంబనంతంబుగా రచియించి జగద్విఖ్యాతి వహించినవారలుగాన నాధర్మశాస్త్రంబులు వైఖానసులకనుష్ఠేయంబులయ్యెనని చెప్పిన నాదేవఋషి పుంగవుం డత్యంతకుతూహలంబున నర్చాస్వరూపుండగు భగవంతుని ప్రతిష్ఠావైభవంబును, పూజామహాత్మ్యంబును నిత్యసేవావ్రత మహిమంబును బ్రహ్మోత్సవ క్రమంబును సావధానంబుగా నాకెరింగింపుమని వేడిన నాశతానందుం డిట్లనియె.

ధరను శిలాతామ్రదారువులందున
హరి దివ్యరూపంబు నమర దేవ
శాస్త్రసమ్మతముగ సౌందర్యలావణ్య
ముగ మనోహరము నింపొందదీర్చి
దివ్యాలయమునందు దేవదేవు బ్రతిష్ఠ
విఖనససూత్రోక్తవిధులతోడ
పంచగవ్యక్షీరవరజలదాన్యాధి

వాసంబులన్ జేసి పారమాత్మి
కాదిహోమంబు లొనరించి యంతపీఠ
మందునునిచి కళాన్యాసమరయ జేసి
అన్నదానంబు ద్విజులకు నవ్యయముగ
జేసి యాజకులకును దక్షిణలొసంగి

ఇట్లు గర్భాలయమునందు నిందిరేశు
సుప్రతిష్ఠనొనర్చించి శుద్ధమతిని
కౌతుకోత్సవబలిబేరకములనాగ
మోక్తవిధము బ్రతిష్ఠించి భక్తితోడ.

పరిధితగోపురమంటపధ్వజమ్ములు విమా
నము బలిపీఠంబు లమరశాస్త్ర
విధమునగట్టించి వేడ్కమీర బ్రతిష్ఠ
జేయించి సత్కీర్తి జెందునట్టి
మనుజుండిహమ్మున మనునంత
కాలంబు సకలసంపదల చేసౌఖ్యమొంది
జన్మాంతమున హరిసాన్నిధ్యమున కేగి
శాశ్వతుడై యుండు సంతతంబు.

నిట్టి మహిమాతిశయముచే నింపుమీర
నొప్పునర్చాస్వరూపుని యుచితభవ్య
భక్తి గొల్చెడివారల భాగ్యమెన్న
దరమె యనిదెల్ప వినిపల్కె తపసియంత.

ఇభవరదు ! సుప్రతిష్ఠా
విభవము వినినంత నాకు వేడ్క మనమునన్
బ్రభవించె నింక దెల్పవె!
శుభకరమగు తచ్చరిత్ర సుగుణగరిష్ఠా !

వ- అని నారదుండడిగిన చతుర్ముఖుండిట్లనియె నోవత్సా !
ఏతద్విషయంబునకొౕక పురాతన ఇతిహాసంబు గలదది
వక్కాణించెద జక్కగ వినుమని యిట్లనియె-

(బ్రహ్మాండపురాణే)

జగతిన్ కన్యాకుబ్జా
నగరంబున వెలయు నందు నయగుణశీలుం
డగు సత్యవ్రతుడను రా
జగణితధర్మాత్ముడగుచు నాపురి నేలున్.

అరయనా భూపతి కాత్మజులిద్దరు
గలరందు నగ్రజుం డలఘుకీర్తి
కాముండు సద్గుణగణనీయు డార్యుండు
వివిధవిద్యల జగద్విశ్రుతుండు
గురుతరసద్ధర్మనిరతు డుత్తముడు శ్రీ
హరిపదభక్తి నేమరనివాడు
ఆతనిసోదరుం డరయ దురాత్ముండు
క్రూరుండు పాపుండు కుచ్ఛితుండు.

నగుచు దుర్వృత్తిచేనుండు నతనిజూచి
జనకుడాగ్రహమున వాని సదనమందు
నుండనీయక వెడలించి మండలాధి
పత్య మగ్రజునకుగట్టె ప్రకటితముగ.

వ- ఇవ్విధంబున నారాజన్యుండు సుగుణగరిష్ఠుండగు నగ్రసుతు
నకు బట్టంబుగట్టి దుష్టచేష్టితుండగు కనిష్ఠపుత్రుని బురి
వెడలన్ గొట్టించిన,

అంతటవాడు లేచి యవనాంతరభూములకేగి ధీరుడై
సంతసమొప్ప చోరజనసంఘములోపలజేరి పాంథులన్
బంతములారగొట్టి బలవంతముగా ధనమంతగొంచు న
త్యంతగుతూహలంబున సదా విహరించుచునుండె నంతటన్.

ఇటులదిరుగుచు నాతడు విటులగూడి
సంచరించుచు గొన్నాళ్ళుజనినపిదప
ముదిమిచే జీర్ణదేహంబు బొదల మదిని
జింతనొందుచుదమపురిజేరనరుగ
నగ్రిజుండటవేడ్కచే నతిశయిల్లి.

వారణము నెక్కి మిక్కిలి
చారుతరంబైన శ్వేతఛత్రావృతుడై
కూరిమితోడ నసత్పరి
వారముగొల్వంగ వెడలె ప్రాభవమొప్పన్.

ఆరీతి నేగు నాతని
దూరంబునగాంచి మిగులదుఃఖించి మదిన్
కూరిమిచే మజ్జనకుం
డారయ నీరాజ్యభారమతనికొసగుటన్.

ఇట్టివిభవంబుగలిగె నేయితనికనుచు
మదినిగుందుచు తనజన్మమిదియటంచు
బుద్ధియందుననిటు దలపోసి పోసి
విధినిదూరుచు నీరీతి వివశుడగుచు.

వ- "లలాటలిఖితారేఖాపరిమార్ష్టుంనశక్యతే" అనున్యాయంబున నొసటివ్రాలిటులుండ వగవన్ ప్రయోజనంబేమి యని మదినిశ్చయించి యచటివారలన్ గాంచి యిట్లనియె.

ఆరాజెచటికేగుననిపల్క తత్పరి
జనముభక్తిజూపి శ్రద్ధతోడ
గాంచి యారాజశేఖరుడిటు శార్ఙ్గపా
ణినియాలయంబున కనుదినంబు
దర్శనార్థంబు తద్దయునేగునని తెల్ప
విని మనంబున నతివేడ్కతోడ
దానునచ్చటికేగి తగనాహరిని ప్రీతి
దర్శించి తత్ప్రసాదముభుజించి

దీనరక్షకుడైన యాదేవదేవు
పాదపంకజములు నమ్మి భక్తిగొల్చి
జన్మసాఫల్యమునుబొంద సమయమిదియె
యనుచు వారలతోనేగు నవసరమున.

ద్వారమున నుండువారలు
వారించియు నవలనేగవలదని యతనిన్
దూరముగ వెడలగొట్టన
పారంబగుదుఃఖమంది పాతకుడనిలన్.

వ- అని యిట్లు బహుప్రకారంబులన్వగచి మరల పశ్చాత్తా
పంబునొంది నిశ్చయమానసుండై కొంతధనంబుసంగ్రహించి
యటనొకదేవాలయంబు గట్టించి శార్ఙ్గపాణినందున్
బ్రతిష్ఠనొనర్పించి యాదేవదేవున కనేక కైంకర్యాదులొన
రించి సకలోత్సవంబులన్ జేయుచు బరమభక్తుండై యుండ
గొంతకాలంబున కాయుక్షీణంబయ్యెనంత నాదేవునను
గ్రహంబున,


శంఖచక్రగదాఖడ్గ శార్ఙ్గధరులు
మకరకుండలసన్మణిమకుటధరులు
నైన హరిపార్శ్వచరులు విమానమపుడు
దోడుకొనిరాగ వారలతోడ నతడు

వ- పరమానందభరితుండై కోటిసూర్యప్రభాభాసమానంబై దశదిశలు వెలుంగు నద్దివ్యవిమానంబున నత్యంతవిభవంబున గూర్చుండి ఛత్రచామరాద్యలంకృతుండై దేవతలు జయజయధ్వానంబులొనరింప పునరావృత్తిరహిత శాశ్వతంబై బ్రకాశిలు పరమపదంబునకరిగెన్. కానసర్చా స్వరూపుండగు నారాయణుని సుప్రతిష్ఠావైభవ మాహాత్మ్యం బిట్టిదని వర్ణింప నెరికి శక్యంబుగాదని చెప్పిన విని నారదుండు హరికథాశ్రవణకుతూహలమానసుండై యావలికథా వృత్తాంతంబెరిగింపుడని వేడుటయు.

ఆశ్వాసాంతము

చండప్రస్ఫుట బాహాదండఘునరక్షశ్శిక్షణోద్దండ బ్రహ్మాండాంతఃప్రతిభాసభాసురశుభానంద్దై కరూపానహో ద్దండప్రక్రియమూల కారణ విశుద్ధాత్మా! ప్లుతా! శాశ్వతా! చండాంశుప్రతిభపరికాశ జగదీశా భావనారాయణా!

కరుణాకర! ఘనవిరజా
నరణా! దాసార్తిహారణ! భవజలనిధిసం
తరణా! వరసచ్చిత్సుఖ
కరణా! దనుజమదహారణ! కవినుతచరణా!



మాలిని॥ పరమపదవిహారా! భక్తలోకోపకారా!
శరనగసమధీరా! భార్గవీచిత్తచోరా!
సురుచిరమణిహారా! శోభితామోఘశూరా!
నిరుపమగుణధారా! నీరదాకారవీరా!

గద్య

ఇతి శ్రీభావనారాయణ కృపాలలితకటాక్షవీక్షా సమాసాదితానవద్య కవిత్వవిద్యా
విరాజమాన నల్లూరివంశ పయఃపారావారరాకా సుధాకరాయమాన గౌతమస
గోత్రపవిత్ర వెంకట్రాయాచార్యపుత్ర సుకవిజనవిధేయ
రంగాచార్యనామధేయ ప్రణీతంబైన శ్రీమదర్చావతార
ప్రభావంబను మహాప్రబంధంబునందు
ద్వితీయాశ్వాసము-సంపూర్ణము.



శ్రీ మదర్చావతార ప్రభావము

తృతీయాశ్వాసము

శ్రీరమణీహృదయేశ్వర !
నీరదగంభీర ! సర్వనిగమాధారా !
కారుణ్యామృతపూరిత
ధీరా ! బాపట్లవాస ! దివ్యవిలాసా !

అవధరింపుము కమలజోద్భవుడు దేవ
సంయమినిజూచి పల్కెను సాదరమున
విష్ణుపూజామహాత్మ్యంబు విశ్రుతముగ
జెప్పెదను వినుమా కర్తచిత్తమలర.

వ- సుదినంబున నిత్యోచితకృత్యంబులు నిర్వర్తించి భక్తి పూర్వకంబుగా,

మొలక వెన్నెలుగల తులసీదళంబులు
త్రిసహస్రములు వేడ్క దెచ్చి మరియు
పూజార్హమగు ద్రవ్యముల నెల్ల గైకొని
హరిమందిరమ్మున కరిగి యంత
యాజకుతో దెల్పి హరినిసంసేవించి
యభివందన మొనర్చి యపుడు దేవు
నకు త్రికాలసహస్రనామపూజాదులు
జేయించి సద్భక్తిచేత తీర్థ
సుప్రసాదములనుగొని సుకుచిరముగ
నిట్టులేకదినంబున నింపుతోడ
పూజ చేయించు నమ్మానవుండు సకల
సంపదలచేత నిహమందు సౌఖ్యమొంది.

వ- అట్టి మహాత్ముండు దేహావసానసమయంబున శ్రీవిష్ణు సాయుజ్యంబు నొందున్ గాన నిందుకొక్క పురాతనేతిహాసంబుగలదది నీకెరింగించెద సావధానచిత్తుండవై యాకర్ణింపుము (బ్రహ్మాండపురాణే)

ధరణీసురవరుడొక్కడు
సరసుడు ధర్మవ్రతుండు శాంతగుణుడు స
త్కరుణాకరు డఘదూరుడు
స్థిరమతి యాఘనుడు తనదు చిత్తమలరగన్.

వేదపారగుడైన యావిప్రవరుడు
దివ్యదేశంబులను పుణ్యతీర్థములను
దర్శనాదుల భజియింపదలచి గృహము
వెడలి సేవించుచును వచ్చి వేడ్కమీర.

శ్రీ వేంకటాద్రినిలయుని
సేవించగ మదినిదలచి శేషనగము స
ద్భావమున నెక్కి యరుగగ
యావిధివశమునను వానికచ్చటవాడమెన్.

వ– కర్మవశంబున వాతజాడ్యగ్రస్తపాదద్వయుండై నడువ సమర్థత లేక విస్మయమానసుండై చింతించుచు నటవసించి మహాపాతకినగునాకు దివ్యమంగళ విగ్రహుండగు శ్రీనివాస మూర్తిని సేవించుటయెట్లు సిద్ధించు నింకనాకెట్లు బుణ్య లోకంబుగలుగునని యనేకవిధంబుల బుద్ధిందలపోయుచు నుండ నంతనచ్చోట నాదేవదేవునను గ్రహంబున తులసీ వనంబుగాన్పించిన నతడత్యంతామోదముంబునొంది యింక ప్రతిదినంబేను సహస్రతులసీదళంబులన్ గోసి యా వేంకటాచలపతికర్పణంబుజేయించి గృతార్థుండనయ్యెదనని నిశ్చయించి దివ్యతులసీదళంబులన్ సంగ్రహించి యాదేవు సాన్నిధ్యమునకెట్లు చేరుదునని యోచింపుచుండ దైవవశంబున నచ్చటికొక విఖనసుండరుదెంచిన.

కని సంభ్రమంబునొందుచు
వినతుండై సంస్తుతించి విమలహృదయుడై
సనయత నిట్లుగ బలికెను
కనులందానందబాష్పకణములు దొరుగన్.

శ్రీకరంబగు తులసీదళంబులు శ్రీని
వాసునికర్పింప వాంఛగలిగి
సంగ్రహించితి నాకు చరణసాధ్యము లేదు
గావున ద్విజవర్య! కరుణతోడ
నిదిస్వల్పధనము నీకిచ్చెదగైకొను
మీయుపకారంబు జేయుమిప్పు
డనిన యాఘనుడిట్టు లనియెనీద్రవ్యంబు
గైకొన జేతునికార్యమేను
గాన తులసీదళంబులు ఘనతనొసగు
శ్రీనివాసునకర్పింతు శీఘ్రముగను
ననుచుబలికిన విని యతడతని జూచి
మరలనిట్లని పల్కెను కరుణతోడ.

వైఖానసాన్వయోద్భవ! తెల్పెదముధర్మ
శాస్త్రగహాస్యార్థసార మొకటి
స్వర్ణభారశతంబు సమముగాదొక తుల
సీదళప్రభల విశిష్టతలకు

కాన స్వల్పధనంబు దీనిగైకొను నీకు
ఫలమనంతము విష్ణుభక్తవర్య!
చిత్తంబలర నీవుజేయుమి కార్యంబు
నతిశీఘ్రముగ వేడ్కనరుగుమనుచు
ప్రార్థనాపూర్వకంబుగ బ్రస్తుతింప
ధనము తులసీదళంబులు దయగ్రహించి
శేషనగ మెక్కి యాతడా శ్రీనివాస
మూర్తి కర్పణజేసెను ముదముతోడ.

ఇటులనర్పించి యంత తానింపుమీఱ
స్వామిసన్నిధి తీర్థప్రసాదములను
దెచ్చి యాద్విజవర్యునకిచ్చినంత
నితడు నానందమగ్నుడై యతనిబొగడె.

వ- ఇవ్విధంబునన్ గొంతకాలంబు జనినపిదప నాయిరువుర కాయుఃక్షీణంబయ్యె నంత నాశ్రీనివాసమూర్తి యనుగ్రహంబున శ్రీహరిపార్శ్వచరులు రత్నస్థగిత ధగద్ధగాయమానంబును శతకోటిరవిప్రభావిభాసితంబును దేవపరివేష్ఠితంబునగు దివ్యవిమానంబుదెచ్చి నమస్కరించిన హరిపార్శ్వచరులకు మ్రొక్కి విమానారోహణంబుజేసి యాదేవాదిదేవుననేక విధంబులన్ గీర్తించుచు వైకుంఠంబున కరిగెఁగాన నర్చాస్వరూపుండగు నారాయణుని పూజాఫలంబిట్టిదని వక్కాణింపనేరికిని శక్యంబుగాదనిచెప్పి,

" ఫలంసమానంతద్ధర్మే వ్యార్థోపాధిన విద్యతే "
అను బ్రహ్మాండపురాణోక్తి నా యిరువురకున్ సమాన ఫలంబగుటచే శ్రీవిష్ణుసాన్నిధ్యంబునొందినవారలింక నిత్య సేవాప్రిత మహిమాతిశయంబున నొకపురాతనేతిహాసంబు గలదు దానిని నీకెఱింగించెద వినుమని యిట్లనియె.

(బ్రహ్మాండపురాణే)

మున్నొకవిప్రవర్యునకు పుత్రుడొకండుగలండు వానిపై మన్ననతోడ తండ్రిగురుమందిరమందున నొప్పగించి యా చిన్నికుమారునిన్ దమకుశిష్యునిగాగ్రహియించి శాస్త్రసం పన్నునిజేయుడంచు దగబల్కగ నాగురువట్లువానికిన్.

శాస్త్రపురాణాది సకలవిద్యల నెల్ల
నతిశ్రద్ధతో జెప్ప నంతవాని
జన్మప్రారబ్ధవశంబున రాకున్కి
వదలె సద్గురువునువాడునచట
వెడలియథేచ్ఛగావిహరింప నదిజూచి
తండ్రియనేకవిధములనతని
కనుదినంబును బోధలను వందజెప్పియు
సరివారలనుగూర్చి మరలమరల
నాతనికిబోధజేయించి యంతమీద
విసిగివేసారి వాడవివేకియగుట
మంతనంబునదలపోసి మదినిరోసి
మందిరము వెడలించుట మంచిదనుచు.

ఇలు వెడలగొట్ట వాడు వె
డలి కుంభజునాశ్రమంబు డగ్గరి యటన
క్కలశజుగని తత్పదయుగ
జలజములకు మ్రొక్కి శరణుశరణని వేడన్.

అంతనమ్మహాత్ము డాతనిగనుగొని
యెవడవీవు నీచటికేలవచ్చి
తివి యెరుంగనాకు వివరింపుమా ! యింక
ననిన నాతడిట్టులనియె నపుడు.

వ- ఓ మహాత్మా ! ఏను బ్రాహ్మణుండ విద్యావిహీనుండ నవు
టచే మజ్జనకుండు గృహంబు వెడలగొట్టెన్ గాన నజ్ఞా
నుండనగు నన్నురక్షించి కృతార్థుంజేయుండని ప్రార్థించిన
నయ్యగస్త్యమహామునీంద్రుండు దయార్ద్రహృదయుండై
యిట్లనియె నోవత్సా ! "విద్యావిహీనః పశుః" అను
న్యాయంబున విద్యలేనివాడు పశుప్రాయుండనంబడునని
చెప్పి వానికుపదేశంబొసంగి యిట్లనియె,

శ్రీరంగమునకుజనినీ
వారంగనిసేవజేయుమనుచు నతడు స
త్కారుణ్యామొప్ప దెల్పిన
కూరిమినాఘనునను జ్ఞగొని కడు వేడ్కన్.

అరిగి కావేరిలో స్నానమాచరించి
నిత్యజపములు కర్మముల్ నేర్పుమీర
సలిపి నిష్ఠాగరిష్ఠుడై సంతసమున
రంగనాథుని దర్శింప రహిని వెడలి.

రమణీయంబగు గోపురంబునను శ్రీరంజిల్ల పద్మేశుని
భ్రమనొందించెడు ద్వారపాలకుల సద్భావంబునన్ గాంచి సం
భ్రమముప్పొంగనమస్కరించి నయతన్ ప్రార్థించి యాముందటన్
క్రమతన్ సద్బలిపీఠమున్ ధ్వజముతాగన్గొంచుసద్భక్తితోన్.

అంత సాష్టాంగవందనంబాచరించి
నిటలతటఘటితాంజలిపుటుడునై ప్ర
దక్షిణ మొనర్చి యటసన్నిధానమునకు
జనియు నా దేవదేవుదర్శనము జేసి.

వ- బహువిధంబుల స్తోత్రంబాచరించి తీర్థప్రసాదంబులన్
గ్రహించి యిట్లు ప్రతిదినంబు,

ఈరీతి నిత్యసేవ స
దారాధిగజేయు నప్పుడాహరియాజ్ఞన్
ధారుణిపతి యాద్విజునక
పారధనంబొసగి తావివాహ మొనర్చెన్.

వ- అంత

అత్యుత్తమచారిత్రుడు
సత్యవ్రతభార్యతోడ సౌఖ్యోన్నతుడై
నిత్యంబగు హరికృపనన
పత్యదశంబొనరగాంచె భాగ్యమలరగన్.

పావనులగుసుతులను నా
నావేదపురాణశాస్త్రనైపుణులుగ స
ద్ధీవరుఁ డొనరించియు తా
నావలబెండ్లిండ్లుజేసె నాహరికృపచేన్.

పుత్రపౌత్రులతోడ బెంపొంది రంగ
నాథునవరతము దర్శనంబువేడ్క-
చేయ నటుముదిమియు బ్రవేశించి నేత్ర
పాటవముదప్పె నంతట బ్రాహ్మణుండు.

నిత్యసేవావ్రతనియమంబుదప్పిన
మానెనంతట నన్నపానములను
నదిజూచి పుత్రపౌత్రాదులు నీవు న
శక్తుడవౌట సద్భక్తివ్రత వి
నాశాన్నదోషోపి నాస్తినాస్తి ససంశ
యఃభుజింపుమయిపుడన్నమీవు
ననిన రంగనితీర్థమును ప్రసాదంబును
గొనకయే భుజియించననుచుబలికె

నంత శ్రీరంగనాయకుడర్చకుగని
యాదరణమునబలికె మాకంతరంగ
భక్తుడగు భూసురోత్తముభవనమునకు
జని యొసగిరమ్ము తీర్థప్రసాదములను.

వ- అని యివ్విధంబున భక్తార్తి భంజనుండగు నారంగనాథుండాజ్ఞనొసంగిన నవ్వైఖానసుండవ్విధంబున నా విప్రుని సదనంబునకరిగి యాతండు ముదంబుననొసంగిన వస్త్రాభరణాదులన్గొని పుత్రపౌత్రాదిసమన్వితుండగు నాద్విజవర్యునకు తీర్థప్రసాదంబులొసంగి యా దేవదేవుసాన్నిధ్యంబునకరిగె నట్లుగొన్ని దినంబులుజనిన పిదప నాభూసురోత్తమునకు దేహావసానసమయంబు సంప్రాప్తంబయిన రంగేశుననుగ్రహంబున శంఖచక్రగదాద్యాయుధులును దివ్యపీతాంబరధరులును కంకణనూపురకుండల కిరీటాద్యలంకృతులును కృపాతరంగకల్లోల సాదరాపాంగవిలోచనులును నగు శ్రీహరిపార్శ్వచరులు దివ్యవిమానంబుదోడ్కొనివచ్చి నిత్యసేవావ్రత నియమపరుండగు నవ్విప్రోత్తముని విమానారోహణంబు జేసికొని దశదిశలువిరాజిల్ల బరమపదమునకరిగిరి. కాన నర్చాస్వరూపుండగు శ్రీవిష్ణుదేవుమహాత్మ్యంబనంతంబనిచెప్పి మరల నిట్లనియె నింక బ్రహ్మోత్సవక్రమం బెఱిగించెదవినుము.

బ్రహ్మోత్సవమునందు ప్రారంభదినమున
దీక్షాదినియమంబు దీర్చిపిదప
అంకురార్పణపూజలాదిగా నొనరించి
యగ్నిప్రతిష్ఠాదు లరయజేసి
ధ్వజమున గద్యపద్యాదితాళములచే
గరుడపటంబును గట్టినంత
దిక్పాలురకు బలుల్ దినదిన మొసగుచు
నిత్యహోమంబులు నియతిజేసి.

భక్తిప్రతిదిన మొక్కొక్క వాహనంబు
పైన దేవుని వేంచేపు బరగజేసి
నృత్యగీతాదివాద్యముల్ నేర్పుమీర
జెలగ బురమున నుత్సవంబలరజేసి.

వ- ఇవ్విధంబునన్ బతాకఛత్రచామరాద్యలంకృతంబుగా నాగమశాస్త్రవిదితంబులగు విశేషదినంబుల యందత్యంత మహావైభవంబుగా నవాహ్నిక, సప్తాహ్నిక, పంచాహ్నికాదిసాంజ్ఞలచే నుత్సవంబొనరించుచు నవాహ్నిక బ్రహ్మోత్సవమునందు షష్ఠమదిన సాయంకాలంబున దేవదేవీ సహితంబుగా నాస్థానంబున జలకుంకుమోత్సవంబును సప్తమదినంబున బూర్వోక్తవిధంబుగ సప్తర్షి పూజా మహోత్సవంబును, అష్టమదినంబున వినోదోత్సవానంతరంబున తిరుకళ్యాణమంటపాభ్యంతరంబున దేవదేవీభ్యాం

సహస్రపవిత్ర విశేషోపచారయుతంబుగా నత్యంతవైభవ సహితకళ్యాణమహోత్సవంబును నవమదినంబున రథమహోత్సవంబును విశేషాన్నదానంబును ననంతరదినంబున తీర్థోత్సవంబాదిగా ననేక విశేషోత్సవంబులు జరుగు నిట్లు శాస్త్రవిదితంబుగా నవాహ్నికోత్సవంబత్యంత విభవంబుగా జేయించు నమ్మానవుండు నిత్యవిభూతియందత్యంత విభవంబునన్ బ్రకాశిలు నింక నీబ్రహ్మోత్సవంబతిభక్తియుక్తి సేవించెడు మానవులు సమస్తపాతకవిదూరులై శ్రీహరి సాన్నిధ్యంబునొందెదరని చెప్పినవిని త్రిలోకసంచారుడగు నారదుండో మహాత్మా! నామనంబు పరమానందంబు నొందె ననిన విని ఓనారదా అష్టాదశసూత్రములలో విఖనస సూత్రము త్తమోత్తమమనంబడు నదెట్లనిన అన్యసూత్రజ్ఞులందరు షోడశకర్మములనొనర్చినవారలు విఖనసబుషితమసూత్రమునందష్టాదశ సంస్కారములజెప్పెనంతియగాక త్రివిధచక్రాంకణ ప్రతిపాదితంబగు శిఖాయజ్ఞోపవీత త్రిదండసన్యాసవిధిని శ్రీవిష్ణు దివ్యాగమశాస్త్రంబును నివిమొదలుగా ననేకవిషయములొనర్చియున్నవారలిదియునుంగాక.

"బ్రహ్మాండపురాణే" అర్చకస్సహరిస్సాక్షాచ్చరరూపోన సంశయః అను న్యాయంబున నవ్విఖనసబుషి భగవంతున కర్చనాద్యుపచారంబులు సమర్పించి దైవస్వరూపుడనన్

బరగినవాడుగాన తత్సూత్రజ్ఞులు వినాఅన్యసూత్రిజ్ఞులు హారి కర్చనాద్యుపచారంబులొనరించిరేని అట్టివారలు దేవల్కుల నంబడుదురని యనేకశాస్త్రములయందు ప్రితిపాదింపబడి యున్నది. కాన సర్వలోకపూజనీయుండవును, బ్రహ్మజ్ఞాన నిపుణుండవును, పరమభాగవతశేఖరుండవునైన నీవు వినా- ఇతరులిట్లు భగవత్కథాసంప్రశ్నంబుజేయనోపుదురే నీవలన గదా సురమునివరసముదయంబుల కర్చావతారమహిమా తిశయంబు గరతలామలకంబుగదెలియవచ్చెనని పలికి,

వనజోద్భవుడీవిధమున
ఘనమగు నర్చావతారకథ వినిపింపన్
మనమలరగవిని నారదు
డనఘా నాకోర్కెసఫలమయ్యెను స్వామీ !.

ఘనమగు నీసద్గ్రింథము
వినినన్ బఠియించిరేని వేడుకమీరన్
ఘనవైకుంఠపురంబున
మనియెదరెల్లపుడు దివ్యమహిమాన్వితులై.

-: దేవాలయ సమ్మార్జనాదుల ఫలము:-

"సమ్మార్జనశతంగావః సహస్రమనులేపనం
మాలాశతసహస్రాణి అనంతం దీపముచ్యతే"

ప్రదక్షిణక్రమము

ఏకంగణపతించైవ ద్వేసూర్యంత్రీణిశంకరం
చత్వారి కేశవంచైవ సప్తాశ్వత్థప్రదక్షిణం॥

ఆహ్నికసంజ్ఞ — నవాహ్నికము

హంసః ఫణీంద్రో హనుమాన్ మృగేంద్రో తురగ స్తథా
గజ పున్నాగ వృక్షౌచ గరుడశ్చ తతో రథః
ఏవమేవక్రమేణైవ నవాహ్నికముదాహృతం॥

సప్తాహ్నికము

అనంత స్సింహహంసేంద్రో భానుబింబంచపక్షిరాట్
దంతావళీ రథశ్చైవ సప్తాహ్నిక ముదాహృతం॥

పంచాహ్నికము

ప్రథమంతుహరిం విద్యాద్ద్వితీయం మృగరాజకం
తృతీయంకపిరాజంచ చతుర్థంవీశమేవచ
పంచమంతురథంచైవ పంచాహ్నికముదాహృతం॥

అర్చనఫలమ్

"ద్విజాతిరతన్ద్రితో నిత్యంగృహే, దేవాయతనేవా భక్త్యా భగవన్తంనారాయణమర్చయేత్ తద్విష్ణోః పరమంపదం గచ్ఛతీతివిజ్ఞాయతే"–(ఇత్యాహ భగవాన్ విఖనాః)

ఆశ్వాసాంతము

సర్వోత్కృష్టపదాత్మభావ విలసత్సర్వైకరూపాకరా!
పర్వేందుప్రతిభాసమాన ముఖసత్పంకేరుహాక్షద్వయా!
నిర్వాణప్రియయోగిమానససుఖోన్మీలప్రభావీక్షణా!
గీర్వాణైకనుతా! సమస్తగుణసాక్షీ భావనారాయణా!

శ్రీశా రంజితభోగా!
శాసితభవచాపభంగ శాశ్వతధుర్యా!
యాశాపతినుతసకలా
త్మేశా! భవహరణచరణ! ఇనశశినయనా॥

కథితసుగుణజాలా! కాలమేఘాభనీలా!
విధిముఖపరిపాలా విశ్వవిఖ్యాతశీలా
ప్రథితకనకచేలా భక్తహృత్కంజలోలా
కుధరధరణహేలా! గోపికాచిత్తలోలా

గద్య

ఇతి శ్రీభావనారాయణ కృపాలలితకటాక్షవీక్షా సమాసాదితానవద్య కవిత్వవిద్యా విరాజమాన నల్లూరివంశ పయఃపారావారరాకా సుధాకరాయమాన గౌతమస గోత్రపవిత్ర వెంకట్రాయాచార్యపుత్ర సుకవిజనవిధేయ రంగాచార్యనామధేయ ప్రణీతంబైన శ్రీమదర్చావతార ప్రభావంబను మహాప్రబంధంబునందు తృతీయాశ్వాసము-సంపూర్ణము.

శ్రీ మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత
శ్రీ భావనారాయణార్పణమస్తు

శుభమ్ భూయాత్



చతుర్భుజ ప్రకాశాయ చతుర్వర్గ ప్రదాయినే ।
చతుర్వేద ప్రపూర్ణాయ భావదేవాయ మఙ్గళమ్ ॥
శ్రీభూమానసచోరాయ శేషపర్యంకశాయినే ।
వైఖానసమునిశ్రేష్ఠ పూజితాయాస్తు మఙ్గళమ్ ॥

ఓం శ్రియైనమః







శ్రీ గరుడాష్టోత్తర శతనామ స్తోత్రమ్

ఓమ్ శ్రీగురుభ్యోనమః హరిః ఓమ్

శ్రీలక్ష్మీవల్లభారంభాం విఖనో మునిమధ్యమామ్
అస్మదాచార్యపర్యన్తాం వన్దే గురుపరమ్పరామ్॥

గరుడధ్యానమ్

నమః పన్నగభూషాయ వైకుంఠవశవర్తినే।
శ్రుతిసింధుసుధోత్పాదమందరాయ గరుత్మతే॥

ఋషాక్షక్షేపదక్షః మిహిరహిమకరోత్తాళతాళాభిఘాతీ
వేలావాః కేళిలోలః వివిధఘనఘటాకందుకాఘాతశీలః
పాయాన్నః పాతకేభ్యః పతగకులపతేః పక్షవిక్షేపజాతో
వాతః పాతాలహేలా పటహపటురవారంభసంరంభధీరః।

పర్యస్యత్పన్నగీనాం యుగపదసమయా సర్భకాన్ గర్భకోశాత్
బ్రహ్మస్తంబప్రకంప వ్యతిషజదఖిలోదన్వదునిద్రఘోషం
చక్షుశ్చక్షుశ్శ్రుతీనాం సపదిబధిరయన్ పాతుపక్షీశ్వరస్య
క్షిప్రక్షిప్తక్షమాభృత్క్షణఘటిత నభస్స్ఫోటమాస్ఫోటితంనః॥

స్తోత్రమ్

గరుడో వేదమూర్తిశ్చ తప్తహాటకసన్నిభః।
అప్రమేయో హ్యమేయాత్మా అనపాయీ మహాబలః॥ ౧

అణిమాదిగుణోపేతః అష్టనాగవిభూషితః।
అనూర్వనుజో క్షేత్రజ్ఞో స్వాతీజోఽమితదీప్తికః॥ ౨

ఆహృతామృతకుమ్భశ్చ అండజో పక్షిరాడ్విభుః।
ఇంద్రోపేంద్రప్రియో దాన్తశ్శాన్తశ్శమదమాన్వితః॥ ౩

ఇంద్రశత్రుర్మహాతేజా దుష్టసంహారకస్తుసః।
ఖగేశ్వరస్త్రయీరూపస్స్వర్ణపక్షో హరిప్రియః॥ ౪

గజకచ్ఛపహర్తా చ కాద్రవేయభయానకః।
గరదోషహరశ్శ్రీమాన్ శ్రీపతిప్రియవాహనః॥ ౫

చూడధ్వజస్త్రయీవేద్యః గరుత్మానభయప్రదః।
దర్వీకరేన్ద్రాభరణో ద్విపక్షో దివ్యవిగ్రహః॥ ౬

దివ్యప్రతాపః పక్షీంద్రో దేవదేవప్రియంకరః।
నాగాశనో నాగవైరీ నారాయణపదాశ్రయః॥ ౭

నాగాన్తకో నాగభూషీ నాగాస్త్రవినివారకః।
పతంగో బలవాన్ భీమః పక్షీశో పన్నగాశనః॥ ౮

ప్రసన్నశ్చాంబుజాక్షశ్చ పంచాయుధవిరాజితః।
భక్తియుక్తశ్శ్వేతముఖో శ్వేతద్వీపనివాసకః॥ ౯

భుజగాభయదాతా చ భుజంగమభయంకరః।
భుజగోత్తమభూషాఢ్యో నాగయజ్ఞోపవీతకః॥ ౧౦

మహాబుద్ధిర్మహాబాహు ర్మాననీయో మహామనాః।
విమలో వేదతత్త్వజ్ఞో వేదాన్తార్థః ప్రకాశకః॥ ౧౧

విష్ణుర్విష్ణురథశ్చైవ విష్ణోః ప్రథమకింకరః।
విష్వక్సేనప్రియసఖో వినతానందదాయకః॥ ౧౨

విష్ణోర్ధ్వజాగ్రసంవాసీ వంధ్యాదోషనివారకః।
విహంగో విక్రమో విప్రో విజరో వైష్ణవోత్తమః॥ ౧౩

వేదస్వరూపో విజ్ఞానీ వినీతో వినయాన్వితః।
వైఖానసైర్ధర్తవరః వాలఖిల్యాభిసంస్తుతః॥ ౧౪

శుకపిఞ్ఛామ్బరధరో ఝల్లరీమేఖలైర్యుతః।
శ్రియఃపతిధరో వీరో శ్రీవైష్ణవనిషేవితః॥ ౧౫

శ్రీరామలక్ష్మణప్రియో సర్వసర్పేంద్రమారకః।
సత్యవ్రతః కామచరో కామితార్థప్రదాయకః॥ ౧౬

సత్సంతానప్రదో దేవః స్వాధ్యాయసుశరీరకః।
సుధాసంపాదకో శూరో శ్వేతచ్ఛత్రేంద్రధారకః॥ ౧౭

సువర్ణవర్ణ స్సుభగో శుభదో సుఖదో మహాన్।
కాశ్యపః కరుణాదృష్టిః మాం పాలయతు సర్వదా॥ ౧౮

ఇతీదం దేవదేవస్య గరుడస్య మహాత్మనః।
రంగార్యేణకృతందివ్యం స్తోత్ర మష్టోత్తరశతమ్॥ ౧౯

గబీజం బిందుసహిత మకారాది స్వరైర్యుతమ్।
పఠన్ నరవరశ్శ్రీమాన్ పశుమా న్గుణవాన్భవేత్॥ ౨౦

స్వాత్యాం తజ్జన్మనక్షత్రే జపన్ సిద్ధిమవాప్నుయాత్।
బ్రహ్మోత్సవే పఠేద్భక్త్యా క్షిప్రం సిద్ధిర్భవిష్యతి॥ ౨౧

గర్భదోషాః నాగదోషాః స్త్రీణాంవంధ్యా పరిదోషజాః।
పీడాఃతూర్ణంప్రణశ్యంతి ప్రాతస్సమ్యక్జపేద్యది॥ ౨౨

గరదోషవినాశాయ స్తోత్రమేతత్పఠేన్నరః।
సూత్రంతస్మై ప్రదాతవ్యం విషం నిర్విషతాంవ్రజేత్॥ ౨౩

వైఖానసస్యశిష్యోహి కశ్యపో వై ప్రజాపతిః।
హరింసంప్రార్థయిత్వాతు లేభేపుత్రం ఖగాధిపమ్॥ ౨౪

కాశ్యపోపి మహాతేజా దేవానాంప్రియకారకః।
శ్రియఃపతేస్తువాత్సల్యా దనపాయ్యాభవత్సదా॥ ౨౫

శ్రీగరుడాష్టోత్తర శతనామస్తోత్రమ్ సమ్పూర్ణమ్॥

హరిః ఓమ్ తత్సత్

★ ★ ★



శ్రీ గరుడాష్టోత్తర శతనామావళిః

ఓమ్ గరుడాయనమః
వేదమూర్తయే
తప్తహాటకసన్నిభాయ
అప్రమేయాయ
అమేయాత్మనే
అనపాయినే
మహాబలాయ
అణిమాదిగుణోపేతాయ
అష్టనాగవిభూషితాయ
అనూర్వనుజాయ
క్షేత్రజ్ఞాయ ౧౦
స్వాతీజాయ
అమితదీప్తికాయ
ఆహృతామృతకుమ్భాయ
అండజాయ
పక్షిరాజాయ
ప్రభవే
ఇంద్రోపేంద్రప్రియాయ
దాన్తాయ
శాన్తాయ
శమదమాన్వితాయ ౨౦
ఇంద్రశత్రవే
మహాతేజసే

ఓమ్ దుష్టసంహారకాయ నమః
ఖగేశ్వరాయ
త్రయీరూపాయ
స్వర్ణపక్షాయ
హరిప్రియాయ
గజకచ్ఛపహర్త్రే
కాద్రవేయభయానకాయ
గరదోషహరాయ ౩౦
శ్రీమతే
శ్రీపతిప్రియవాహనాయ
చూడధ్వజాయ
త్రయీవేద్యాయ
గరుత్మతే
అభయప్రదాయ
దర్వీకరేంద్రాభరణాయ
ద్విపక్షాయ
దివ్యవిగ్రహాయ
దివ్యాయ ౪౦
ప్రతాపాయ
పక్షీంద్రాయ
దేవదేవప్రియంకరాయ
నాగాశనాయ
నాగవైరిణే

ఓమ్ నారాయణ
సమాశ్రియాయ నమః
నాగాన్తకాయ
నాగభూషాయ
నాగాస్త్రవిషనివారకాయ
పతంగాయ ౫౦
బలవతే
భీమాయ
పక్షీశాయ
పన్నగాశనాయ
ప్రసన్నాయ
అంబుజాక్షాయ
పంచాయుధవిరాజితాయ
భక్తియుక్తాయ
శ్వేతముఖాయ
శ్వేతద్వీపనివాసకాయ ౬౦
భుజగాభయదాత్రే
భుజంగమభయంకరాయ
భుజగోత్తమ భూషాఢ్యాయ
నాగయజ్ఞోపవీతకాయ
మహాబుద్ధయే
మహాబాహవే
మాననీయాయ

ఓమ్ మహామనసే నమః
విమలాయ
వేదతత్వజ్ఞాయ ౭౦
వేదాన్తార్థప్రకాశకాయ
విష్ణవే
విష్ణురథాయ
విష్ణోఃప్రథమకింకరాయ,
విష్వక్సేనప్రియసఖాయ
వినతానందదాయకాయ
విష్ణోర్ధ్వజాగ్రవాసినే
వంధ్యాదోషనివారకాయ
విహంగాయ
విక్రమాయ ౮౦
విప్రాయ
విజరాయ
వైష్ణవోత్తమాయ
వేదస్వరూపాయ
విజ్ఞానాయ
వినీతాయ
వినయాన్వితాయ
వైఖానసైర్దత్తవరాయ
వాలఖిల్యాభి సంస్తుతాయ
శుకపిఞ్ఛాంబరధరాయ ౯౦

ఓమ్ ఝల్లరీమేఖలైర్యుతాయ
శ్రియఃపతిధరాయ నమః
వీరాయ
శ్రీవైష్ణవ నిషేవితాయ
శ్రీరామలక్ష్మణప్రియాయ
సర్వసర్పేంద్రమారకాయ
సత్యవ్రతాయ
కామచరాయ
కామితార్థ ప్రదాయకాయ
సత్సంతాన ప్రదాయ
దేవాయ ౧౦౨
స్వాధ్యాయ సుశరీరకాయ

ఓమ్ సుధాసంపాదకాయ నమః
శూరాయ
శ్వేతమృత్పుండ్రధారిణే
ఓమ్ సువర్ణవర్ణాయ నమః
సుభగాయ ౧౦౮
శుభదాయ
సుఖదాయ
మహతే
కాశ్యపాయ
కరుణాదృష్టయే
శ్రీభావనగరాధీశ
సేవకాయ నమోనమః.

